



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 71 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | గురువారం 04 డిసెంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-


## బెంగాల్‌లో ఎస్ఐఆర్..

### మోదీ కీలక వ్యాఖ్యలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమబెంగాల్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్కడ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరుగుతోంది. దాని నిర్వహణపై బెంగాల్‌కు చెందిన భాజపా ఎంపీలకు ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచనలు చేశారు. ఆ ప్రక్రియ సరళంగా, పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలని

మిగతా .. 2లో..

## అది డెత్ వారెంటే...

### సోనియా గాంధీ తీవ్ర వ్యాఖ్యలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. ఆరావళి పర్వతాల భౌగోళిక స్వరూపాన్ని మార్చేలా తీసుకుంటున్న చర్యలు డెత్ వారెంటేనని ఆగ్రహం వ్యక్తంచేశారు. వంద మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న కొండల్లో

మిగతా .. 2లో..

వలసలపై ఆంక్షలు..

## ఆ దేశాలకే నష్టం : జై శంకర్



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా, ఐరోపా దేశాల్లో వలసల ఆంక్షలపై విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. వలసలు, నైపుణ్యం కలిగిన ఉద్యోగుల రాకపోకలపై మితిమీరిన ఆంక్షలు విధిస్తే.. వాటి సొంత ప్రయోజనాలే దెబ్బతినే అవకాశం ఉందన్నారు. చివరకు ఆ దేశాలే

మిగతా .. 2లో..

## వ్యవసాయం లాభసాటికి..

# పంచసూత్రాలు

- ఆహార అలవాట్లకు అనుగుణంగా సాగు పద్ధతులు ఉండాలి
- వ్యవసాయ అనుబంధ రంగాలపైనా రైతన్నలు దృష్టి పెట్టాలి
- అంతర పంటలతో అధిక ఆదాయం
- విద్యుత్ ఛార్జీలు పెంచబోం..
- గత పాలకులు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు...ఖజానా ఖాళీ చేశారు
- రైతన్నా..మీకోసం సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- అంతరపంటల పరిశీలన, మేలు సాగు విధానాలు పాటిస్తున్న రైతులకు సీఎం సన్మానం



**నల్లజర్ల, విశ్వం వాయిస్ న్యూస్ :** వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి, అన్నదాతకు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం పంచసూత్ర ప్రణాళికతో ముందుకెళుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పంచసూత్రాలపై అవగాహన కల్పించేందుకే రైతన్నా...మీకోసం కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి రైతు కుటుంబం అభివృద్ధి చెందడమే లక్ష్యంగా పనిచేస్తోందని చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలో రైతన్నా...మీ కోసం కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి నిర్వహించారు. వ్యవసాయ యాక్షన్ ప్లాన్ పై చర్చించారు. అంతకముందు అక్కడి రైతులు సాగు చేస్తున్న అంతర్ పంటలను పరిశీలించారు. అనంతరం రైతులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ...'వ్యవసాయమే మన బలం. రాష్ట్రంలో 62 శాతం మంది వ్యవసాయ, అనుబంధ రంగాలపైన ఆధారపడి జీవిస్తున్నారు. అందుకే సాగును లాభసాటి చేసేందుకు మొదటి రోజు నుంచి ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

**వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి పెట్టాలి**

మనది వ్యవసాయ ఆధారిత రాష్ట్రం. వ్యవసాయం లాభసాటిగా మారాలి. రైతుకు గిట్టుబాటు ధర రావాలి. తెలంగాణలో 60 శాతం సర్వీస్ సెక్టార్ ఉంది. అక్కడ వ్యవసాయంలో వచ్చే ఆదాయం 14 శాతంగా ఉంది. వ్యవసాయం,

మిగతా .. 2లో..

త్వరలో మరో 40వేల ఉద్యోగాలు

## భర్తీ చేస్తాం..

తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి



**హుస్నాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** త్వరలో మరో 40వేల ఉద్యోగాల భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో రూ.262 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. "సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ హుస్నాబాద్ నుంచే బహుజన దండు కట్టారు. తెలంగాణ ఉద్యమం ఈ ప్రాంతం నుంచి ఉవ్వెత్తున ఎగసిపడింది. కరీంనగర్‌లో ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకే సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారు. శ్రీకాంతాచారి స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 60వేల ఉద్యోగాలు ఇచ్చాం. ప్రజాపాలన రెండున్నరేళ్లు పూర్తయ్యేలోగా లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తాం. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఎస్ఆర్ఎస్పీ ఎలా ఉందో?.. భారత రాష్ట్ర సమితి కట్టిన కాళేశ్వరం ఎలా ఉందో ప్రజలు ఆలోచించాలి. దేశంలో అత్యధికంగా

మిగతా .. 2లో..

దిత్వా తుపాను ప్రభావం..

## ఏపీలో పలుచోట్ల వర్షాలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** దిత్వా తుపాను ప్రభావంతో ఏపీలో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. నెల్లూరులో మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలు ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో ప్రజల అవస్థలు పడుతున్నారు. మాగుంట లేఔట్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరద నీరు భారీగా నిలిచింది. దీంతో రాకపోకలు నిలిపివేశారు. అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలో నాలుగు రోజులుగా వర్షాలు పడుతున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు కుంటలు జలకళను సంతరించుకున్నాయి. గుంజన నది ఉదృతంగా

మిగతా .. 2లో..

## రైతులు దేశానికి వెన్నుముక

రైతులు దేశానికి వెన్నుముక - ఎన్డీయే ప్రభుత్వంలో రైతులకు అత్యధిక ప్రాధాన్యత
రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంది
కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన హోం మంత్రి అనిత



**ఎస్.రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రైతన్న మీకోసం-రైతు వారోత్సవాలలో భాగంగా హోం మంత్రి వంగలపూడి అనిత బుధవారం ఎస్.రాయవరం మండలంలోని గుడివాడ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో డ్రాగన్ ఫ్రూట్ వ్యవసాయ క్షేత్రాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం రైతులతో ముఖాముఖీ సమావేశంలో పాల్గొని వారి సమస్యలు, అవసరాలు, సాగు పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సేంద్రీయ వ్యవసాయాన్ని విస్తరించే దిశగా అధికారులతో మంత్రి అనిత చర్చించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను పరిశీలించి వాటి గురించి వివరాలు

మిగతా .. 2లో..

ఏపీ రాజ్‌భవన్ పేరు..

## లోక్‌భవన్‌గా మార్పు



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీలోని రాజ్‌భవన్‌కు లోక్‌భవన్‌గా పేరు మార్చారు. పేరు మార్చుడానికి గవర్నర్ ఆమోదం తెలపడంతో నోటిఫికేషన్ విడుదలైంది. కేంద్ర ప్రభుత్వం గవర్నర్ల అధికారిక నివాసం రాజ్‌భవన్ పేరును లోక్‌భవన్‌గా మార్చాలని రాష్ట్రాలకు సూచించిన విషయం తెలిసిందే. ఈక్రమంలోనే ఏపీలోనూ పేరు మార్చారు. వలసవాద వాసనలను తుడిచి పెట్టేందుకు..రాజ్‌భవన్, రాజ్ నివాస్‌ల పేర్లను లోక్‌భవన్, లోక్‌నివాస్‌లుగా మార్చే అంశాన్ని పరిశీలించాలని గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లకు సూచిస్తూ

మిగతా .. 2లో..

భారత్‌లో పుతిన్ పర్యటన వేళ

## పశ్చిమ దేశాల పంచాయతీ



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్.. భారత పర్యటనకు ముందు చిన్నపాటి దౌత్యపరమైన వివాదం తలెత్తింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని విమర్శిస్తూ ఇండియాలో ప్రచురితమైన ఓ వ్యాసం అందుకు కారణమైంది. దీన్ని యూకే, ఫ్రాన్స్, జర్మనీ దేశాల దౌత్యవేత్తలు రాయడం గమనార్హం. దీనిపై మన విదేశాంగ శాఖ అధికారులు తీవ్రంగా స్పందించారు. గురు, శుక్రవారాల్లో భారత్‌లో పుతిన్ పర్యటించనున్న విషయం తెలిసిందే.శాంతి ఒప్పందం దిశగా పుతిన్‌కు ఏమాత్రం ఆసక్తి లేదని ఓ ప్రముఖ జాతీయ దినపత్రికకు రాసిన వ్యాసంలో వారు ఆరోపించారు. రష్యా కావాలనే ఈ యుద్ధాన్ని కొనసాగిస్తోందని విమర్శించారు. ప్రపంచవ్యాప్తంగా ఆ దేశం సైబర్ దాడులు చేస్తోందన్నారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తోందన్నారు. అక్కడి నాయకత్వం దురాక్రమణలకు పాల్పడుతోందని ఆరోపించారు. దీని పరిణామాలు ఉక్రెయిన్ వెలుపల కూడా ఉన్నాయని రాసుకొచ్చారు. శాంతి చర్చలను పుతిన్ కావాలనే

మిగతా .. 2లో..

## లాంఛనంగా మొదలైన ఉద్భవ్-2025 ఉత్సవాలు

- ప్రారంభించిన కేంద్రమంత్రి జువల్ ఓరమ్
- కేవీ, సైనిక్, నవోదయ స్కూళ్ల తరహాలో ఈఎంఆర్ఎస్‌ల అభివృద్ధి
- గిరిజన చిన్నారులు అన్ని రంగాల్లో రాణించాలి
- ఉద్భవ్-2025 వేడుక కాదు..గొప్ప మార్పుకు వేదిక : ఏపీ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి
- తెలుగులో పలకరించి, ప్రసంగించిన ఎన్ఇఎస్‌టిఎస్ కమిషనర్ అజిత్ కుమార్ శ్రీవాత్సవ
- ఉద్భవ్-2025ను నిర్వహిస్తున్నందుకు గర్విస్తున్నాం : గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.మల్లికార్జున నాయక్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** గిరిజన విద్యార్థులు చదువు మాత్రమే కాకుండా సంస్కృతి, సంప్రదాయాలు కూడా నేర్చుకోవాలని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరమ్ వెల్లడించారు. ఈఎంఆర్ఎస్ బాలబాలికలు అన్ని రంగాల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. అమరావతిలోని కేఎల్ యూనివర్శిటీ వేదికగా ఉద్భవ్-2025 వేడుకలను కేంద్రమంత్రి తొలిరోజు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థులకు హిందీ, ఇంగ్లీష్, ప్రాంతీయ భాష కూడా ముఖ్యమే అన్నారు. గిరిజన వ్యవహారాల శాఖకు వాజ్ పేయి హయాంలో నామకరణం జరిగిందని ప్రస్తావించారు. గత ఐదేళ్లూ జరిగిన గిరిజన సంస్కృతి ఉత్సవాల సమయంలోనూ తానే కేంద్రమంత్రిగా ఉండడం పట్ల

మిగతా .. 2లో..

# వ్యవసాయం లాభసాటికి పంచసూత్రాలు



(మొదటిపేజీ తరువాయి)

అనుబంధ రంగాలు మన రాష్ట్ర GSDPలో 34 శాతం వాటా కలిగి ఉన్నాయి. రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలపైనా దృష్టి పెట్టాలి. అలాగే భూగర్భ జలాలు పెంచుకోగలిగితే కరువు ఉండదు. రాబోయే రోజుల్లో గోదావరిని వంశధారలో కలుపుతాం. పెన్నాకూ తీసుకెళతాం. ఈ ఏడాది 7 వేల టీఎంసీల నీరు వృథాగా సముద్రంలోకి పోయింది. కృష్ణా నుంచి 1500 టీఎంసీల నీరు సముద్రంలోకి పోయింది. ఇందులో 200 టీఎంసీల నీరు మనం వాడుకోగలిగితే కరువు అన్నమాటే వినపడదని సీఎం అన్నారు.

**కృష్ణా-గోదావరి అనుసంధానంతో ప్రతి ఎకరాకు నీళ్లు**

భూమినే జలాశయంగా చేసి భూగర్భ జలాలు పెంచుకోగలిగితే కరువు ఉండదు. పోలవరం రైట్ కెనాల్ నుంచి నీరు ఇస్తే ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరుగుతాయి. రాష్ట్రమంతటా డిసెంబర్ 1 నాటికి 6.8 మీటర్ల భూగర్భ జలాలు రాగా తూర్పుగోదావరి జిల్లాలో 18 మీటర్లు ఉన్నాయి. అందుకు ఇక్కడున్న భూమే కారణం. కరువు ఎక్కువగా ఉండే సీమలోని నంద్యాల జిల్లాలో 4 మీటర్లకు భూగర్భ జలాలు పెరిగాయి. రాష్ట్రం మొత్తం మీద తూర్పు గోదావరి, ఏలూరు, ప్రకాశం జిల్లాలో భూగర్భ జలాలు తగ్గాయి. రాష్ట్రంలో కృష్ణా, గోదావరి నుంచి నీరు వృథాగా సముద్రంలోకి పోతోంది. ఈ రెంటిని అనుసంధానం చేసి ప్రతి ఎకరాకు సాగు నీరు అందిస్తాం. ఈ ఏడాది రిజర్వాయర్లలో 900 టీఎంసీల నీరు ఉంది. 700 టీఎంసీల వరకూ భూగర్భ జలాలు ఉన్నాయి. 20 లక్షల పంప్ సెట్లు ఉన్నాయి. సాగు, తాగుతో పాటు పరిశ్రమలకు నీటి ఎద్దడి లేకుండా చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**డిమాండ్ ఉన్న పంటల సాగుతో ఆదాయం**

రైతులు డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలి. వినూత్న పద్దతుల్లో విభిన్న పంటలు పండించాలి. ఏ పంటలకు డిమాండ్ ఉంది, ఎక్కడ మార్కెట్ ఉంది, సాగులో కొత్త పద్దతులు ఏంటి అనే వాటిపై రైతులకు అవగాహన రావాలి. వ్యవసాయ రంగాన్ని రీ-ఓరియేంటేషన్ చేస్తాం. యూనివర్సిటీల్లో చేస్తున్న పరిశోధనలు రైతులకు ఉపయోగకరంగా ఉండాలి. పామాయిల్ సాగులో టెక్నాలజీ ఉపయోగించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చు. ఆనాడు పామాయిల్ సాగును ఎన్టీఆర్ ప్రోత్సహించారు. సాగు కోసం మొదటిసారిగా మలేషియా నుంచి మొక్కలు తెప్పించారు. నేడు ప్రపంచీకరణతో మొత్తం మారింది. ఎక్కడో ఉక్రెయిన్ లో జరిగిన యుద్ధం మన పంటలపై ప్రభావం చూపుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు కోపం వస్తే మన రొయ్యి ఎగిరిపోయే పరిస్థితి వచ్చింది. ఇథనాల్ తయారీ కోసం కేంద్ర ప్రభుత్వాలు మొదట మొక్కజొన్న సాగును ప్రోత్సహించాయి. తర్వాత పాలసీ మారడంతో ఇథనాల్ తయారీకి 40 శాతం వరి నూకలు, 60 శాతం జొన్నలు వాడుతున్నారు. దీంతో మొక్కజొన్నకు డిమాండ్ తగ్గి రైతులు నష్టపోయారు. అలాగే డిమాండ్ ఉందని హెచ్డీ బర్లీ పొగాకు భారీగా సాగు చేశారు. తర్వాత మార్కెట్ పడిపోయింది. అంతర్ పంటలు వేసిన రైతులకు లాభాలు వస్తున్నాయి. ఎరువుల వాడకం ఎక్కువగా ఉంటే ఖర్చు పెరిగిపోతుంది. చిత్తూరు జిల్లాలో కొందరు రైతులు మామిడి పండ్లకు పురుగు పట్టకుండా కవర్ పెట్టి జాగ్రత్తలు తీసుకోవడంతో మంచి లాభాలు పొందారని సీఎం తెలిపారు.

**ప్రకృతి సేద్యంతో ఆరోగ్యం పదిలం**

టెక్నాలజీ వినియోగంతో వ్యవసాయం లాభసాటిగా మారుతుంది. ఒక పంట వరి వేసినప్పటికీ మరో పంటగా హార్టికల్చర్ కు వెళితే ఆదాయం పెరుగుతుంది. నియోజకవర్గానికి ఒక ఎంఎస్ ఎంఈ పార్కు పెడుతున్నాం. రైతులు పండించిన పంటను నేరుగా వినియోగదారునికి విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నాం. నేడు రైస్ తినడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. కాబట్టి వరితో పాటు ఇతర పంటలపై రైతులు దృష్టి పెట్టాలి. ప్రకృతి సేద్యంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా తయారుచేస్తున్నాం. సీమలో 18 రకాల పంటలు, పండ్లు పండుతున్నాయి. ఎడారిలో పండే ఖర్జూరాలనూ వాళ్లు పండిస్తున్నారు. కాఫీ నుంచి కోకో వరకు, బత్తాయి నుంచి బొప్పాయి వరకు, పట్టు నుంచి పసుపు వరకు...పామాయిల్ నుంచి శనగ వరకు, అగ్రికల్చర్ నుంచి ఆక్వాకల్చర్, హార్టికల్చర్ వరకు....మన దగ్గర పండని పంటలేదు, మన దగ్గర దొరకని ఫలం లేదు. మారిన పరిస్థితులకు అనుగుణంగా ముందుకెళ్లాలి. డైరీ, పౌల్ట్రీ...మీట్ లో రూ.2 లక్షల కోట్ల జీఎస్డీపీ వస్తుంది. హార్టికల్చర్ లో రూ.లక్షా 85 వేల కోట్ల జీఎస్డీపీ వస్తుంది. చేపలు, రొయ్యల సాగుతో రూ.లక్షా 45 వేల ఆదాయం వస్తుంది. వ్యవసాయంలో కేవలం రూ.50 వేల ఆదాయమే వస్తుంది. ఒకప్పుడు అరకు కాఫీ ఎవరికీ పెద్దగా తెలీదు. మనం ఇచ్చిన ప్రోత్సాహంతో నేడు అరకు కాఫీ గ్లోబల్ బ్రాండ్ గా మారింది. ఏపీ రైతు తెలివైనవాడు. నీళ్లు ఎక్కడుంటే అక్కడ మన రైతు ఉంటారు. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణతో పాటు ఆఫ్రికా వంటి దేశాల్లోనూ వ్యవసాయం చేస్తున్నారని సీఎం అన్నారు.

**గత పాలకులు ఖజానా ఖాళీ చేశారు**

గడిచిన ఐదేళ్లలో పాలన ఎలా ఉందో మనం చూశాం. జగన్మోహన్ రెడ్డి వ్యవస్థలను సర్వనాశనం చేశాడు. ఖజానా ఖాళీ చేశాడు. కనీసం అప్పు దొరకని పరిస్థితి. తాము దక్కించుకోవాల్సిన భూమిని దక్కించుకోలేకపోతే... ఆ భూములను లిటిగేషన్లో పెట్టేవారు. అలాంటి భూములను 22-ఎ జాబితాలో చేర్చే వారు. అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పలికారు. కూటమిపై నమ్మకంతో ప్రజలు అద్భుత విజయం అందించారు. అన్నింటినీ సరిచేసుకుంటూ వస్తున్నాం. సూపర్ సిక్స్ తో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం. తల్లికి వందనం కింద రూ.15 వేలు ఆర్థిక సాయం అందిస్తున్నాం. దీపం-2 కింద ఏటా 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాం. మెగా డీఎస్సీతో 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేశాం. అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకు ఏడాదికి రూ. 20 వేలు అందిస్తున్నాం. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు ఇంటి వద్దకే పౌర సేవలు అందిస్తున్నాం. కరెంటు చార్జీలు పెంచబోమనే మాటకు కట్టుబడి ఉన్నాం. వచ్చే సంక్రాంతి నాటికి గుంతలు పడ్డ రోడ్లన్నీ మరమ్మతులు చేస్తాం. ఇప్పటికే టాటా సంస్థ సహకారంతో డిజిటల్ నెర్వ్ సెంటర్ సంజీవని కేంద్రాలనే ప్రాజెక్టును తీసుకొచ్చామని సీఎం తెలిపారు.

**విమర్శలు సహజమే**

పాలనలో సంస్కరణలు తీసుకొస్తున్న క్రమంలో అడ్డంకులు సహజం. నాడు నేను ఐటీని ప్రోత్సహించినప్పుడు విమర్శలు చేశారు. డ్వాక్రా సంఘాలు పెట్టినప్పుడు హేళన చేశారు. కానీ నేడు వాటి ఫలితాలు ఎలా ఉన్నాయో చూస్తున్నారు. సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తున్నాం. విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సులో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇప్పటికే విశాఖ నగరానికి గూగుల్ డేటా సెంటర్ వచ్చింది. 20 లక్షల ఉద్యోగాలు కల్పనకు కట్టుబడి ఉన్నాం. కేంద్ర సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని, 2047 నాటికి స్వర్ణాంధ్ర కల సాకారమవుతుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# లాంఛనంగా మొదలైన ఉద్భవ్-2025 ఉత్సవాలు

(మొదటిపేజీ తరువాయి)

సంతోషం వ్యక్తం చేశారు. జవహర్ లాల్ నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, సైనిక్ స్కూళ్ల తరహాలోనే ఈఎంఆర్ఎస్ పాఠశాలలను అభివృద్ధి చేస్తామని కేంద్రమంత్రి ఓరమ్ స్పష్టం చేశారు. క్రీడల్లో కూడా గిరిజన విద్యార్థులు మెరుస్తున్నారన్నారు. ఉద్భవ్ అంటే హృదయాంతరాల నుంచి బయటకి తీయడం అనే అర్థం అన్నారు. అందుకే ఈ ఉత్సవాలకు ఆ పేరు పెట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎంతో కష్టపడి ఉత్సవాలలో లోటుపాట్లు లేకుండా నిర్వహిస్తోన్న ఏపీ ప్రభుత్వం, గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి, ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి ఎం.మల్లికార్జున నాయక్ లను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా 6వ జాతీయ ఈఎంఆర్ఎస్ సంస్కృతి, సాహిత్య, కళా ఉత్సవాన్ని జువల్ ఓరమ్ ఆవిష్కరించారు. అనంతరం కేంద్రమంత్రి జువల్ ఓరమ్ ని రాష్ట్రమంత్రి గుమ్మిడి సంధ్యారాణి సన్మానించారు. కలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ఆయనకు బహూకరించారు. అంతకుముందు ముఖ్య అతిథిగా వచ్చిన కేంద్ర మంత్రి ఓరమ్ ను ఈఎంఆర్ఎస్ విద్యార్థులు గిరిజన సంప్రదాయ నృత్యాల నడుమ స్వాగతం పలికారు. అనంతరం ఆయన సభా ప్రాంగణం వద్ద గిరిజన సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. బొమ్మలను పరిశీలించారు. విల్లును పట్టుకుని బాణాన్ని ఆకాశానికి ఎక్కుపెట్టి కేంద్రమంత్రి ఓరమ్ సందడి చేశారు. అక్కడే ఏర్పాటైన గిరిజనుల ఉత్పత్తిగా అంతర్జాతీయ ఖ్యాతి పొందిన అరకు కాఫీ స్టాల్ ను సందర్శించారు. దాంతో పాటు గిరిజనుల ఉత్పత్తి అయిన తేనే బాటిళ్లను పరిశీలించారు.

**ఉద్భవ్-2025 వేడుక కాదు..గొప్ప మార్పుకు వేదిక : ఏపీ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి**

ఉద్భవ్-2025 అంటే వేడుక కాదు..గొప్ప మార్పుకు వేదిక అని ఏపీ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి వెల్లడించారు. చిన్నారులలోని ప్రతిభ, సృజనాత్మకతను బయటకి తీసి విశ్వాసం నింపాలనేదే లక్ష్యమన్నారు. కొత్త పరిచయాలు, కొత్త సంప్రదాయాలను తెలుసుకునే అవకాశం ఈ ఉత్సవం వల్ల సాధ్యపడుతుందన్నారు. 405 ఈఎంఆర్ఎస్ స్కూళ్ల నుంచి 1647 మంది తరలివచ్చారని మంత్రి సంధ్యారాణి స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఇంత పెద్ద సంఖ్యలో చిన్నారులు పాల్గొనే వేదిక ఏపీ కావడం సంతోషకరమన్నారు. 110 మంది ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. గిరిజనుల అభివృద్ధికోసం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని ఉద్భవ్ -2025 వేదికగా మంత్రి సంధ్యారాణి వెల్లడించారు. వెనుకబడిన వర్గాలకు సీఎం నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందన్నారు. గిరిజన చిన్నారులు కూడా డాక్టర్లు, ఇంజినీర్లు, టీచర్ల వంటి గొప్ప చదువు చదవడమే కాకుండా మంచి పౌరులుగా నిలవాలన్నారు. గెలుపు ముఖ్యమే..కానీ ఓటమికి మాత్రం భయపడకూడదంటూ ప్రసంగంతో స్ఫూర్తి నింపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీలోని గిరిజన బిడ్డల చదువు, పాఠశాల వసతులకు మరిన్ని నిధులివ్వాలని కేంద్రమంత్రి ఓరమ్ కు విన్నవించారు. గిరిజనులుండే రిమోట్ ఏరియాలో రోడ్డు నిర్మాణం, అనుసంధానానికి ప్రాధాన్యమివ్వాలని కోరారు. ఏపీకి మరిన్ని ఈఎంఆర్ఎస్ స్కూళ్లను మంజూరు చేయాలన్నారు. తెలుగులో పలకరించి, ప్రసంగించి నెస్ట్స్ కమిషనర్ అజిత్ కుమార్ శ్రీవాత్సవ ఆశ్చర్య పరిచారు. నెస్ట్స్ ఆధ్వర్యంలో కళా ఉత్సవాలు ప్రతి ఏటా నిర్వహిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆతిథ్యంతో ఈ వేడుకలు మరింత ప్రతిధ్వనిస్తాయన్నారు. 2019లో గిరిజన సంప్రదాయానికి తగిన గుర్తింపు దక్కిందన్నారు. గతంలో కన్నా ఎక్కువ కేటగిరీల్లో పోటీలు జరుగుతున్నాయన్నారు. గతంలో లేని విధంగా ఉద్భవ్-2025ను నిర్వహిస్తున్నందుకు ఏపీ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని బాగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా కృషి చేసిన గౌతమి,ఐఏఎస్ కు అభినందనలు తెలియజేశారు.

**ఉద్భవ్-2025ను నిర్వహిస్తున్నందుకు గర్విస్తున్నాం:గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.మల్లికార్జున నాయక్**

28 లక్షల మంది గిరిజనులున్న ఏపీలో ఉద్భవ్ -2025కు ఆతిథ్యమిస్తున్నందుకు గర్వపడుతున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.మల్లికార్జున నాయక్ పేర్కొన్నారు. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ వల్ల మనలోని వైవిధ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. దేశవ్యాప్తంగా 740 ఈఎంఆర్ఎస్ లు ఉన్నాయన్నారు. 440 ఈఎంఆర్ఎస్ భవనాలను కేంద్రం నిర్మిస్తోందన్నారు. రాష్ట్రాలవారీగా గిరిజనుల జీవన వైవిధ్యం, సంస్కృతిని దేశవ్యాప్తంగా తెలిపే వేదికగా ఉద్భవ్-2025 మారుతుందన్నారు. ఇటువంటి ఉత్సవాలలో సినీ ప్రముఖులను కూడా భాగస్వామ్యం చేస్తే మరింత బాగుంటుందన్నారు. 20 ప్రత్యేక బృందాలను నియమించి పోటీలకు తగిన వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే పోటీలకు తగ్గ భోజన, వసతి సదుపాయాలు సిద్ధంగా ఉందన్నారు. కేఎల్ యూనివర్శిటీలో 2 థియేటర్లు, 3 సెమినార్ హాల్స్, 10 తరగతి గదులు, ఓపెన్ ఎయిర్ థియేటర్, పెద్ద సెమినార్ హాల్ లలో వివిధ కేటగిరీలకు పోటీలు నిర్వహిస్తామన్నారు. గ్రూప్ ఈవెంట్లు, స్టోరీ టెల్లింగ్, క్రియేటివ్ రైటింగ్ పోటీలు కూడా జరగనున్నాయన్నారు. జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. నెస్ట్స్ ఆధ్వర్యంలో 36 బృందాలను సంసిద్ధం చేసినట్లు స్పష్టం చేశారు. క్లినిక్, అంబులెన్స్ వంటి అత్యవసర సదుపాయాలు కల్పించామన్నారు. చిన్నారుల రక్షణ, రవాణాకు లోటు రాకుండా పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలను ఏ ఇబ్బంది రాకుండా నిర్వహించేందుకు రాష్ట్రమంత్రి సంధ్యారాణి నిరంతరం సమీక్షించారన్నారు. అతిథుల ప్రసంగాల అనంతరం కేంద్రమంత్రి జువల్ ఓరమ్, రాష్ట్ర మంత్రి సంధ్యారాణి, మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ రాయపాటి శైలజ, లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ షేక్ హసన్ బాష , నెస్ట్స్ కమిషనర్ అజిత్ కుమార్ శ్రీవాత్సవ, తదితరులను సన్మానించారు. కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశుని విగ్రహాలను వారికి జ్ఞాపికలుగా బహూకరించారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలనతో ఉద్భవ్ ఉత్సవాలను ముఖ్య అతిథి కేంద్ర మంత్రి ఓరమ్, రాష్ట్ర మంత్రి సంధ్యారాణి ప్రారంభించారు. ప్రార్థన గీతంతో పాటు మారేడుమిల్లి ఈఎంఆర్ఎస్ బాలికల ప్రారంభ గీతం ప్రత్యేకార్షణగా నిలిచింది. వేదికపై సంప్రదాయ థింసా సంగీత, నృత్య ప్రదర్శనతో అరకువ్యాలీ ఈఎంఆర్ఎస్ బాలబాలికలు ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో లిడ్ క్యాప్ ఛైర్మన్, పిల్లి మాణిక్య రావు, మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ రాయపాటి శైలజ, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ షేక్ హసన్ బాషా,టీడీపీ ఎస్టీ సెల్ ప్రెసిడెంట్ దారు నాయక్, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి వీ.మల్లికార్జున నాయక్, నెస్ట్స్ కమిషనర్ అజిత్ కుమార్ శ్రీవాత్సవ, ఏపీ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సదా భార్గవి, గురుకులం కార్యదర్శి ఎం.గౌతమి, నెస్ట్స్ జాయింట్ కమీషనర్ బిపిన్ చంద్ర రటూరీ, కేఎల్ డీమ్డ్ యూనివర్శిటీ డీన్, ప్రొఫెసర్ జీపీఎస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో మరో 40వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం..

(మొదటిపేజీ తరువాయి)

వరిని పండించేది మన రాష్ట్రంలోనే. వ్యవసాయం అంటే దండగ కాదు.. పండగ అని చేసి చూపించింది మన ప్రభుత్వమే. రాష్ట్రంలో రైతుల కోసం రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు పెట్టాం. రాష్ట్రంలో వందలాది బస్సులకు ఆడబిడ్డలు యజమానులు అయ్యారు. 3.10 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. రూ.22,500 కోట్లు పేదల ఇళ్ల కోసం ఖర్చు చేస్తున్నాం. గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలో మొదలు పెట్టిన ప్రాజెక్టులు అన్నీ పూర్తయ్యాయి. కానీ, హుస్నాబాద్ నియోజకవర్గంలోని గౌరెల్లి ప్రాజెక్టు ఇంకా పూర్తి కాలేదు. గత పాలకుల మాదిరిగా హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చెయ్యం. త్వరలో గౌరెల్లి ప్రాజెక్టు పూర్తి చేస్తాం" అని సీఎం ప్రకటించారు. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు సభలో పాల్గొన్నారు.

# బెంగాల్‌లో ఎస్ఐఆర్..

(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. అర్హత ఉన్న ఓటర్లను చేర్చడం, అర్హత లేని వారిని తొలగించడమే దాని ఉద్దేశమని, ఇదే సందేశం క్షేత్రస్థాయికి చేరేలా చూసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు ప్రధాని సన్నిహితవర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అలాగే 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉండాలని ఎంపీలకు మోదీ సూచించారు. అలాగే తృణమూల్ కాంగ్రెస్, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్లను ప్రస్తావించకుండా.. విపక్షాల ట్రాప్‌లో చిక్కవద్దని బెంగాల్ భాజపా ఎంపీలకు హితబోధ చేశారు. అంతేగాకుండా ఆ రాష్ట్రంలో భాజపా ఎదిగిన తీరును ప్రస్తావించారు. 2011లో అసెంబ్లీలో ముగ్గురు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని గుర్తుచేశారు. 2021లో ఆ సంఖ్య 65కు చేరింది. స్థానిక అంశాలపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని ఎంపీలతో పేర్కొన్నారు. కాగా.. కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తోన్న ఎస్ఐఆర్‌ను విపక్షాలు తొలి నుంచి వ్యతిరేకిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మోదీ స్పందన వచ్చింది. ఇదిలాఉంటే.. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆందోళన చేపడుతోన్న సంగతి తెలిసిందే. ఈసీ 'భాజపా కమిషన్'గా మారిందని, దిల్లీ నుంచి వచ్చిన సూచనల ప్రకారం నడుచుకుంటోందని ఆరోపణలు చేస్తున్నారు. ఎన్ని కేంద్ర సంస్థలను రాష్ట్రంలోకి తీసుకువచ్చినా.. ఎంత ఖర్చుపెట్టినా తనను రాజకీయపరంగా ఓడించలేరని గతంలో విరుచుకుపడ్డారు. "మీరు నన్ను లక్ష్యంగా చేసుకుని బెంగాల్‌లో రాజకీయంగా దెబ్బకొట్టాలని చూస్తే... దేశవ్యాప్తంగా మీ పార్టీ పునాదులను కదిలిస్తా. గాయపడిన పులి మరింత ప్రమాదకరమైనది" అని భాజపాపై ధ్వజమెత్తారు. బెంగాల్‌లో ఎస్ఐఆర్ అనంతరం ముసాయిదా ఓటర్ల జాబితా బయటకు వచ్చిన తర్వాత.. ఈసీ, భాజపా సృష్టించిన గందరగోళాన్ని ప్రజలు గుర్తిస్తారని తెలిపారు. ఈ ఎస్ఐఆర్‌ను ఈ ప్రక్రియను రెండు, మూడేళ్లపాటు నిర్వహిస్తే సహకరిస్తామని చెప్పారు.

# అది డెత్ వారెంటే...

(మొదటిపేజీ తరువాయి)

మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చంటూ ఆరావళి పర్వతాల విషయంలో కేంద్ర పర్యాటక శాఖ కొత్త మార్పులు తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలోనే సోనియాగాంధీ ఓ జాతీయమీడియా సంస్థకు రాసిన కథనంలో ఆందోళన వ్యక్తంచేశారు. ఆ కథనంలోని కొన్ని లైన్స్‌ను కాంగ్రెస్ షేర్ చేసింది. "గుజరాత్, రాజస్థాన్, హరియాణాల్లో విస్తరించి ఉన్న ఈ పర్వతాలది దేశ చరిత్ర, భౌగోళిక స్వరూపంలో కీలక పాత్ర. అక్రమ మైనింగ్ వల్ల ఇప్పటికే వాటి సహజ సంపద తరిగిపోతుండగా.. మోదీ ప్రభుత్వం వాటికి డెత్ వారెంట్ ఇచ్చింది. 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న కొండల్లో మైనింగ్‌కు అనుమతించింది. ఇది మైనర్లు, మాఫియాకు బహిరంగ ఆహ్వానం. ప్రభుత్వ విధానాల్లో పర్యావరణంపై నిర్లక్ష్యానికి ఇది నిదర్శనం. ఇది వన్యప్రాణుల రక్షణ చట్టాన్ని (1972) ఉల్లంఘించడమే అవుతుంది. వెంటనే ఈ విధానాన్ని వెనక్కి తీసుకోవాలి" అని సోనియా డిమాండ్ చేశారు. కేంద్రం తీసుకువచ్చిన మార్పులను అంగీకరించిన సుప్రీంకోర్టు.. అక్రమ మైనింగ్‌ను నిరోధించేందుకు తీసుకోవలసిన చర్యలపై చేసిన సిఫారసుల్ని పరిశీలించేందుకు ఓకే చెప్పింది. సుస్థిర మైనింగ్ కోసం నిర్వహణ ప్లాన్‌ను సిద్ధం చేయాలని పర్యావరణ మంత్రిత్వశాఖను సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. ఈ ప్లాన్ ఖరారయ్యే వరకు మైనింగ్ కోసం కొత్తగా లీజులు ఇవ్వకూడదని ఆదేశాల్లో పేర్కొంది. కాగా.. ప్రపంచంలోనే పురాతనమైన పర్వతశ్రేణుల్లో ఆరావళి ఒకటి. వాటిలో మితిమీరిన మానవ కార్యకలాపాలు, వనరుల దోపిడీ కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దానివల్ల పలు రాష్ట్రాలతో పాటు రాజధాని దిల్లీ ప్రాంతం సైతం భవిష్యత్తులో తీవ్ర వాతావరణ దుష్పరిణామాలతో తల్లడిల్లే ప్రమాదం పొంచి ఉందని ఎప్పటినుంచో ఆందోళనలు వినిపిస్తున్నాయి.

# ఆ దేశాలకే నష్టం : జై శంకర్

(మొదటిపేజీ తరువాయి)

నష్టపోతాయని హెచ్చరించారు. దిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఈమేరకు మాట్లాడారు. చాలా సందర్భాల్లో వాళ్లే ఈ సమస్యను సృష్టించారని, కాబట్టి స్వయంగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. "నైపుణ్యం కలిగిన ఉద్యోగుల రాకపోకలకు, ఈ సంక్షోభానికి ఎటువంటి సంబంధం లేదు. వలసలకు సంబంధించి అమెరికా, ఐరోపా దేశాల్లో ఏమైనా ఆందోళనలు ఉంటే.. అవి ఆ దేశాలు అమలు చేసిన దీర్ఘకాలిక విధానాల ఫలితమే. గత రెండు దశాబ్దాల్లో ఉద్దేశపూర్వకంగా, అన్ని తెలిసే తమ వ్యాపారాలను విదేశాలకు విస్తరించాయి. ఇది వారి వ్యూహం. కాబట్టి.. ఈ సమస్యలకు స్వయంగా పరిష్కార మార్గాలు కనుగొనాలి.

**బెంగాల్‌లో ఎస్ఐఆర్.. మోదీ కీలక వ్యాఖ్యలు**

నైపుణ్యం కలిగిన ఉద్యోగుల రాకపోకలనేవి ఇరుపక్షాలకు ప్రయోజనమని పాశ్చాత్య దేశాలు గుర్తించాలి. ఒకవేళ పెద్దఎత్తున ఆంక్షలు విధిస్తే ఆ దేశాలే నష్టపోతాయి. ప్రపంచం అధునాతన తయారీ రంగం వైపు మళ్లుతున్న కొద్దీ.. నైపుణ్యం కలిగిన ప్రతిభ అవసరం పెరుగుతుంది. ఏ దేశం కూడా స్వయంగా సరిపడా సంఖ్యలో నిపుణులను వేగంగా తయారు చేయలేదు" అని జైశంకర్ పేర్కొన్నారు. ఈ ఒత్తిళ్లను సమతుల్యం చేసుకునేందుకు పాశ్చాత్య దేశాలు చివరకు ఓ మార్గాన్ని కనుగొంటాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఏపీలో పలుచోట్ల వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రవహిస్తోంది. వర్షం కారణంగా తిరుపతి-కడప ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పలు చోట్ల రహదారులపై వరద నీరు చేరింది.

# రైతులు దేశానికి వెన్నుముక

(మొదటిపేజీ తరువాయి)

అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు, అధికారులు హోం మంత్రిని ఘనంగా సన్మానించారు. హోం మంత్రి అనిత మాట్లాడుతూ రైతులు దేశానికి వెన్నుముకని పేర్కొన్నారు. రైతులకు నేను ఉన్నాను అనే భరోసా ఇవ్వాలని అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం రైతులకు అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి, 24 గంటల్లో రైతుల ఖాతాల్లోనే డబ్బులు జమ చేస్తున్నామని వెల్లడించారు. రైతులు సేంద్రీయ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని సూచించారు. రాబోయే ఏడాదిలో కనీసం 50 శాతం సేంద్రీయ వ్యవసాయం అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. తమలపాకుల రైతులకు అధికంగా నష్టపరిహారం అందజేశామని గుర్తు చేశారు. తరువాత బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన మదర్ థెరిస్సా మహిళా సహకార సంఘ సభ్యులకు రూ. 2,54,000 చెక్కును హోం మంత్రి అనిత అందజేశారు.

# లోక్‌భవన్‌గా మార్పు

(మొదటిపేజీ తరువాయి)

ఇటీవల కేంద్ర హోంమంత్రిత్వ శాఖ రాసిన లేఖకు అనుగుణంగా చాలా రాష్ట్రాల్లో చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పశ్చిమబెంగాల్, తమిళనాడు, గుజరాత్, అస్సాం, కేరళ, త్రిపుర, ఒడిశా, తెలంగాణ రాజ్‌భవన్‌లను లోక్‌భవన్‌లుగా మార్చారు. ఇప్పుడు ఆ జాబితాలో ఆంధ్రప్రదేశ్ కూడా చేరింది.

# పశ్చిమ దేశాల పంచాయతీ

(మొదటిపేజీ తరువాయి)

వాయిదా వేస్తున్నారని.. ఆయనకు ఒప్పందం చేసుకోవడం ఇష్టం లేదని వ్యాఖ్యానించారు. ఈ వ్యాసంపై భారత విదేశాంగ శాఖ కార్యదర్శి కన్వల్ సిబల్ స్పందించారు. అలాంటి అభిప్రాయాలు వ్యక్తం చేయడానికి ఇది సమయం కాదన్నారు. దీన్ని ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ఆర్భాటంగా అభివర్ణించారు. ఇది దౌత్యపరమైన నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని స్పష్టం చేశారు. సందేహం లేకుండా ఇది భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమేనని తెలిపారు. భారత్‌లోని యూరప్ మద్దతుదారుల్లో రష్యాపై వ్యతిరేకతకు ఆజ్యం పోయడమేనని దుయ్యబట్టారు. వ్యాసంలోని అభిప్రాయాలు రష్యాతో భారత సంబంధాలను పరోక్షంగా ప్రశ్నిస్తున్నట్లుగా ఉందని దుయ్యబట్టారు.

## లాభ దాయకంగా ఉండే
# పంట వేయాలి

### రైతన్నా మీకోసం కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి

**నూజివీడు/ఆగిరపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** నూజివీడు నియోజకవర్గం ఆగిరపల్లి మండలం నెక్కలం గొల్లగూడెం గ్రామంలో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తొలుత ప్రకృతి వ్యవసాయ శాఖ వారు ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రదర్శించి వివరాలు అడిగి తెలుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ గత వ్యవసాయానికి నేటి వ్యవసాయానికి చాలా తేడా ఉందని రైతులు లాభసాటి పంటను వేయాలని అన్నారు. ప్రస్తుతం కాలంలో కూలీల కొరత ఎక్కువగా ఉన్నందున యాంత్రిక శక్తి ఉపయోగించుకోవాలని కోరారు. రైతులకు రోటవేటర్, డ్రోన్, ట్రాక్టర్లు, ఇలా పలు వ్యవసాయ పనిముట్లు ప్రభుత్వం రాయితీ పై అందిస్తుందని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అలాగే నీటిని సద్వినియోగం చేసుకోవాలని డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సాగు చేస్తే నీటి వినియోగం తగ్గి లాభసాటిగా ఉంటుందన్నారు. డిమాండ్ ఉన్న పంటలు వేయాలని ఉదా:వరి తగ్గించి ఫామాయిల్,కోకో, మొక్కజొన్న,ఇలా వాణిజ్య పంటలు సాగుచేస్తే వ్యవసాయం లాభ సాటిగా ఉంటుందన్నారు. అంతర్ పంట కూడా వేస్తే రైతు లాభాలు గడించ వచ్చన్నారు. రైతుల అవగహన సదస్సులో పాల్గొని వ్యవసాయ సాగులో మెలుకవలు తెలుసుకోవాలని అన్నారు.గత ప్రభుత్వం రైతుకు 1 రూ.కూడా ఇవ్వకుండా వ్యవసాయాన్ని తుంగలో తొక్కిందని కూటమి ప్రభుత్వం ధాన్యం కొన్న 24 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బు జమ చేస్తుందన్నారు. గత ప్రభుత్వం వ్యవసాయ ఋణాలు 1 రూ.కూడా ఇవ్వలేదని కూటమి ప్రభుత్వం డ్రోన్లు,రోట వేటర్లు, ఇలా పలు వ్యవసాయ యంత్రాలు పనిముట్లు 50 శాతం 90 శాతం సబ్సిడీ తో



కూటమి ప్రభుత్వం ఋణాలు అందిస్తుంద న్నారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనుభవం ఉన్న శాస్త్ర వేత్తలు పరిశోధించిన తరువాత మాత్రమే ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటుందని రైతులు అర్థం చేసుకొని ఎరువులు వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం, మరియు ఆధునిక వ్యవసాయం అలవాటు చేసుకోవాలని కోరారు. అన్న దాత సుఖీభవ ద్వారా రూ.20 అందిస్తున్నామని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.మామిడి రైతులకు పేను సమస్య ఎక్కువగా ఉన్నందున 4 నెలల ముందుగానే పరిష్కరించుకోవాలి తెలిపారు. ఖరీఫ్ లో మునుపెన్నడూ లేని విదంగా నియోజకవర్గ పరిధిలోని చెరువుల అన్నీ నీటితో నింపామని దానితో రైతులంతా ఆనందంగా పంటలు విత్తారని తెలిపారు. గత 18 నెలల కాలంలో సుమారు.200 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసానని ఆర్&బి సిసి, రోడ్లు చెరువుల మరమ్మత్తులు, ప్రభుత్వ భవనాలు నిర్మాణం ఇలా కూటమి ప్రభుత్వంలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. త్వరలో చింతలపూడి కాలువ పనులు పూర్తి చేసి నియోజక వర్గాన్ని శస్య శ్యామలంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధి రెండు కళ్ళుగా భావించి అభివృద్ధి చేస్తుందని మొన్న జరిగిన విశాఖ సిఐఐ సదస్సులో సుమారు. రూ.13.50.లక్షల కోట్ల ఒప్పందం జరిగిందని వాటిలో సుమారు.రూ.50 కోట్లు ఫుడ్ ప్రోసెసింగ్ పరిశ్రమలకే ప్రభుత్వం నిధులు కేటాయించిదని తద్వారా యువతకు లక్షల్లో ఉద్యోగ ఉపాది అవకాసాల లభిస్తాయన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే బహుళ జాతి సంస్థలు రూ.9లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టాయని తద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరిగి రాష్ట్రం అభివృద్ధి పధంలో నడుస్తుందన్నారు. నియోజకవర్గంలో ప్రతీ ఎకరాకు నీరందించాలాని.ప్రతీ గింజ ప్రభుత్వం కొనాలని అధికారులకు ఆదేశించిన మంత్రి. భూగర్భ జలాలు పెరిగే విదంగా ఇంకుడు గుంటలు, చెరువులు నింపాలని రైతులకు అధికారులు చూసించారు.అటు రైతులు ఇటు అధికారులు సమన్వయంతో అవగహన తో వ్యవసాయం చేస్తే లాభాలు గడించి ఆర్ధికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్, బి.వినూత్న, అగ్రికల్టర్, జేడి, ఎస్కె అబీబ్ భాష, తహశీల్దార్ ప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారులు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, వేణు, రఘు, వేంకటేశ్వరరావు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# '15 ఏళ్ల'పై గ్రౌండ్ లెవిల్ టాకేంటి..!



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 15 సంవత్సరాలు పాటు ఉండాలి అన్నది జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెబుతున్న మాట. తాజాగా సీఎం చంద్రబాబు కూడా ఇదే మాట చెప్పారు. అయితే వాస్తవానికి పవన్ కళ్యాణ్ అయినా చంద్రబాబు అయినా గత కొన్నాళ్లుగా ఇదే మాట చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చే 15 సంవత్సరాలు అధికారంలో ఉంటుందని, ఈ విషయంలో ఎటువంటి తేడా లేదని పవన్ కళ్యాణ్ ఇటీవల రాజోలు సభలో చెప్పుకొచ్చారు. అయితే నాయకుల మాట ఎలా ఉన్నప్పటికీ క్షేత్ర స్థాయిలో ఈ విషయంపై కార్యకర్తలు నాయకుల మనోభావాలు, ఆలోచనలు, ప్రణాళికలు వంటివి ఎలా ఉన్నాయి అన్న విషయాన్ని పరిశీలిస్తే ఆశ్చర్యకరంగా ఉంటుంది. 15 ఏళ్ల అధికారంలో ఉండడం అనే దాని విషయంలో ఎవరికీ అభ్యంతరం లేకపోయినా.. క్షేత్రస్థాయిలో పదవులు, ఎమ్మెల్యే సీట్లు, అలాగే మంత్రివర్గం వంటి కీలక అంశాలపై విస్తృతమైన చర్చ నడుస్తోంది. ఎందుకంటే రాజకీయంగా ఎప్పటికప్పుడు పరిస్థితులు మారుతూ ఉంటాయి. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి పార్టీలు పుంజుకోవడం జరుగుతూనే ఉంటుంది. ఈ క్రమంలో జనసేన బీజేపీ వర్గాలు కూడా వచ్చే పదిహేను సంవత్సరాలు పాటు ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాప్పటికీ తమ ప్రాతినిధ్యం తన సీట్లు పెంపు విషయాలపై ఒక స్పష్టమైన వైఖరితో ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో తమకు సీట్లు పెంచాలని క్షేత్రస్థాయి నాయకులు చర్చిస్తున్నారు. ఇక బీజేపీ నాయకులు కూడా ఇదే విషయంపై పట్టుబడుతున్నారు. గత ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు 31 స్థానాలను టిడిపి ప్రకటించింది. పది బీజేపీకి 21 స్థానాలను జనసేనకు ఇవ్వగా మిగిలిన స్థానాల్లో టిడిపి పోటీ చేసింది. అయితే, వచ్చే ఎన్నికల్లో తమకు మరిన్ని సీట్లు పెంచాలి అన్నది జనసేన నుంచి బలంగా వినిపిస్తోంది. బిజెపి నుంచి కూడా అటువంటి డిమాండ్ తెర మీదకు వస్తుంది. సో.. క్షేత్రస్థాయిలో ఈ తరహా పరిస్థితి ఉన్నప్పుడు దీనిని ముందుగానే పరిష్కరించుకుని అడుగులు వేయాల్సిన అవసరం పార్టీలకు ఉంటుంది. లేని పరిస్థితిలో టికెట్ల పంచాయతీలు పదవుల పంచాయితీలు మరింత ముదిరే అవకాశం స్పష్టంగా కనిపిస్తుందని పరిశీలకులు భావిస్తున్నారు. 15 ఏళ్ల అధికారం విషయంలో ఎలాంటి తేడా లేకపోయినా.. అనుసరించే విధానమే కీలకమని అంటున్నారు పరిశీలకులు.

## సిఎస్‌ను కలిసిన
# ఎపి అంధుల క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధి బృందం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ అంధుల క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధి బృందం బుధవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను కలిసింది.ఇటీవల అంధ మహిళల ప్రపంచ క్రికెట్ కప్ గెలుగుకున్నఈబృందం టీమ్ కెప్టెన్ దీపిక మరియు టీం సభ్యురాలు కరుణ కుమారి నేతృత్వంలో సిఎస్ ను మర్యాద పూర్వకంగా కలిసింది.ఈ సందర్భంగా అంధుల క్రికెట్ టీమ్ ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ఆంధ్రప్రదేశ్ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టిన అంధులైన క్రికెటర్లకు ప్రభుత్వం నుండి తగిన సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. సిఎస్‌ను కలిసిన వారిలో ఎపి క్రికెట్ బ్లైండ్ అసోసియేషన్ అధ్యక్షులు చెన్న శరత్‌బాబు,కార్యదర్శి జి.రవీందర్,కోచ్ మరియు ట్రెజరర్ అయిన అర్జున్ అవార్డు గ్రహీత అజయ్ కుమార్ రెడ్డి, టి20 ప్రపంచ కప్ బ్లైండ్ క్రికెట్ ఇండియా కెప్టెన్ దీపిక టిసి, టి20 ప్రపంచ కప్ బ్లైండ్ క్రికెట్ స్టార్ ప్లేయర్ కరుణ కుమారి,టీం ఇండియా మేనేజర్ శికా శెట్టి, బోర్డు మేనేజర్ కె.కీర్తన, మెడికల్ హెడ్ డాక్టర్ జింకా లక్ష్మీ ప్రసన్న, లక్ష్మీ నారాయణ్ కుర్రా బెంగళూరు తదితరులు పాల్గొన్నారు.

## ఫస్ట్ టైమ్..
# పవన్ కల్యాణ్‌పై షర్మిల కామెంట్స్..




జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై కాంగ్రెస్‌పార్టీ ఏపీ చీఫ్ షర్మిల తొలిసారి కీలక వ్యాఖ్యలు చేశారు. కోనసీమ కొబ్బరి చెట్లకు దిష్టి తగిలిందని, అందుకే అవి మొదుల్లా మారు తున్నాయని రాజోలు పర్యటన సందర్భంగా పవన్ కల్యాణ్ కామెంట్లు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై తెలంగాణ నాయకులు తీవ్రంగా స్పందించారు. ఇదేసమయంలో మంత్రులు కూడా ఫైరయ్యారు. ఇక, దీనిపై జనసేన పార్టీ వివరణ ఇచ్చింది. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను వక్రీకరించవద్దని కోరింది. ఇదిలావుంటే.. తాజాగా ఇవే వ్యాఖ్యలపై షర్మిల రియాక్ట్ అయ్యారు. దిష్టి వ్యాఖ్యలతో పవన్ కల్యాణ్ కొబ్బరి రైతులను అవమా నించారని ఆమె ఆరోపించారు. ఇది మూఢనమ్మకమని.. దీనిని రైతుల సమస్యలపై రుద్దుతున్నారని ఆమె చెప్పారు. సమస్య ను సమస్యగా చూసి.. అధికారంలో ఉన్నవారు పరిష్కరించాల్సిందిపోయి.. దిష్టి అంటూ.. వ్యాఖ్యానించడం సరికాదన్నారు. సముద్ర తీరం కారణంగా ఉప్పునీటితో కొబ్బరి చెట్లు మోడు వారుతున్నాయని.. ఈ సమస్యను అక్కడి రైతులు ఎవరిని అడిగినా చెబుతారని.. దీని పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని షర్మిల కోరారు. దీనికి గాను రూ.3500 కోట్లను తక్షణమే కేటాయిస్తే.. రైతులకు మేలు జరుగుతుందన్న షర్మిల.. సమస్యను పరిష్కరించకుండా పచ్చదనానికి, కొబ్బరి చెట్లకు దిష్టి తగిలిందని చెప్పడం సరికాదని వ్యాఖ్యానించారు. ఇక, రెండు రాష్ట్రాల మధ్య కూడా ఈ వ్యాఖ్య లు చిచ్చు రేపాయని.. రాష్ట్రాలుగా విడిపోయినా తెలుగు ప్రజలు అన్నదమ్ముల్లా కలిసి ఉన్నారని ఆమె తెలిపారు. ఈ నేపథ్యం లో డిప్యూటీ సీఎం స్థానంలో ఉన్న పవన్ కల్యాణ్ ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా ఉండాలని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా ఆయన బేషరుతుగా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కోరారు. కాగా.. రాజోలు నియోజకవర్గంలో పల్లె పండుగ-2.0లో పాల్గొన్న పవన్‌కల్యాణ్.. ఇక్కడి రైతులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన దెబ్బతిన్న కొబ్బరి చెట్ల విషయాన్ని ప్రస్తావిస్తూ.. వీటికి దిష్టి తగిలిందని.. అందుకే మోడుల్లా మారిపోయా యని వ్యాఖ్యానించారు. ఈ సమయంలో తెలంగాణ విభజన అంశాన్నిప్రస్తావించారు. ఇది రాజకీయంగా వివాదానికి దారి తీసింది. కాగా.. ఈ విషయంలో రాజకీయ పార్టీలు మౌనం పాటిస్తే.. బెటర్ అని తటస్థులు సూచిస్తున్నారు.

# మండలి రాజకీయం.. వైసీపీకి ఏదో చేయాలని.. !



శాసనమండలి చైర్మన్ మోషన్ రాజు తాజాగా రాజీనామా చేసిన ఎంఎల్సి లతో భేటీ అయ్యారు. వారి వివరణ తీసుకున్నారు. అయితే ఇది కాస్త రాజకీయ వివాదంగా మారింది. ఉద్దేశపూర్వకంగానే ఎమ్మెల్సీలను ఆయన తన చాంబర్కి పిలిపించుకుని ప్రశ్నించారని రాజీనామా చేసిన ఎమ్మెల్సీలు వ్యాఖ్యానించారు. ముఖ్యంగా మర్రి రాజశేఖర్ విషయంలోకి ఒకింత ఇబ్బందికరంగా వ్యవహరించారనేది టిడిపి నాయకుల మధ్య జరుగుతున్న చర్చ. ఈ విషయం ఇలా ఉంటే. ప్రస్తుతానికి రాజీనామా చేసిన వారిని నిలువరించే ప్రయత్నం చేసినా.. లేక రాజీనామాలను ఆమోదించకపోయినా దానివల్ల పెద్దగా ప్రయోజనం అయితే కనిపించడం లేదు. ఎందుకంటే రాజీనామా చేసిన తర్వాత వారిని స్టాండ్ బై లో పెట్టడం ద్వారా ప్రస్తుతానికి వారిని సభకు రాకుండా నిలువరించవచ్చునేది తప్ప ఇంతకు మించి జరిగే కార్యక్రమాలు కూడా ఏమీ పెద్దగా లేవు. పైగా ఎమ్మెల్సీ లను అడ్డుకున్నారన్న వాదన తప్ప మండలి చైర్మన్ కూడా సాధించేది ఏమీ ఉండదు. కాబట్టి ఈ విషయంలో అనవసరమైన రాజకీయానికి తెర తీయకుండా మండలి చైర్మన్ తన హుందాతనాన్ని కాపాడుకుంటేనే బెస్ట్ అనే మాట కూడా వినిపిస్తోంది. ప్రస్తుతం రిజైన్ చేసిన ఎమ్మెల్సీల విషయానికి వస్తే వీరి భవిష్యత్తు ఏంటి అనేది ఇంకా ఇప్పుడే స్పష్టంగా తెలియడం లేదు. ప్రస్తుతానికి హైకోర్టు ఆదేశాలు మేరకు మోషన్ రాజు వీళ్ళందరినీ విచారించారు. కానీ వారు చేసిన రాజీనామాలు ఆమోదించాలా లేదా అనే విషయంలో మాత్రం ఇంకా స్పష్టంగా తెలియడం లేదు. హైకోర్టు ఆయనకు నాలుగు వారాల సమయం ఇచ్చింది. కాబట్టి ఈలోగా విచారణ చేసి తిరస్కరించే అవకాశం ఉంటుంది. లేదా మళ్లీ వివరణ కోరే అవకాశం కూడా ఉంటుంది. ఎలా చూసుకున్నా ఎమ్మెల్సీల వ్యవహారం డోలాయమానంలోనే ఉందని చెప్పాలి. వైసీపీ నుంచి మండలి కి అడుగుపెట్టిన ప్రజాప్రతినిధులు తర్వాత కాలంలో ఆ పార్టీకి రాజీనామా చేశారు. బయటికి వచ్చారు. ఈ నేపథ్యంలో శాసనమండలి కి రాజీనామా చేసి పార్టీలు మారిన వారు.. రాజీనామా చేయకుండానే పార్టీ మారిన వారు కూడా ఉన్నారు. వీరి విషయంలో వైసీపీ ఏమీ పట్టుబట్టనప్పుడు.. మండలి చైర్మన్‌గా ఎందుకు సాగదీస్తున్నారన్నది ప్రశ్న. దీనిని ఆమోదించేస్తే.. ఒక రాజకీయ వివాదానికి తెరదించినట్టు అవుతుంది. మొత్తంగా ఈ వ్యవహారం ఎటు దారితీస్తుందనేది చూడాలి.

# కో ఆర్డినేషన్‌తో టీడీపీలో పొలిటికల్ మంటలు ఆరేనా ..!



రాష్ట్రంలో కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో పరిస్థితులు ఒకింత ఇబ్బందికరంగా ఉంటున్నాయి. ఒకే ఒరలో రెండు కత్తులు అన్న సామెత కొన్ని కొన్ని నియోజకవర్గాలలో స్పష్టంగా కనిపిస్తుంది. గత ఎన్నికలకు ముందు టికెట్లు త్యాగం చేసిన వారు.. అదేవిధంగా టికెట్లు దక్కని వారు కూడా అసంతృప్తితో ఉన్నారు. పైగా తమకు న్యాయం జరగలేదన్న ఆవేదనలోనూ వారు కనిపిస్తున్నారు. ఇది ఎలా ఉన్నప్పటికీ ప్రస్తుతం చిలకలూరిపేట, మైలవరం అదేవిధంగా పలు నియోజకవర్గాల్లో టిడిపిలో రెండు అధికారిక కేంద్రాలు ఏర్పడ్డాయి అన్నది వాస్తవం. ఈ విషయం పార్టీలోనూ అటు అధికార వర్గాల్లో కూడా చర్చ నడుస్తుంది. ఎందుకంటే ఇటు ఎమ్మెల్యే అటు టికెట్ త్యాగం చేసిన నాయకులు కూడా అధికారులపై ఒత్తిడి తీసుకురావడం.. పనులు చేయించుకోవడం అనేది కామన్ గా మారింది. దీనివల్ల అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అన్నది ఇటీవల సీఎం చంద్రబాబు దృష్టికి కూడా వచ్చింది. నిజానికి ఎమ్మెల్యే చెప్పినట్టు అధికారులు వినడం అనేది కామన్. అయితే గతంలో ఎమ్మెల్యేలుగా చేసిన వారు గత ఎన్నికల్లో టికెట్ కోల్పోయిన వారు ఇప్పుడు అదే అధికారులపై ఒత్తిడి తీసుకురావడం కూడా ఇటీవల కాలంలో కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో స్పష్టంగా కనిపించింది. ఇది ఇట్లా ఉంటే మరోవైపు పార్టీపరంగా కార్యక్రమాలు నిర్వహించే విషయంలో కూడా ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతుంది. ఎమ్మెల్యే అనుచరులు మాజీ ఎమ్మెల్యే అనుచరులు అన్నట్టుగా రెండు వర్గాలుగా రెండు గ్రూపులుగా పార్టీ నాయకులు మారిపోయారు. దీనివల్ల పార్టీ కార్యక్రమాలకు బలమైన ప్రాతిపదిగా ఉన్నప్పటికీ బలమైన నాయకత్వం అయితే కనిపించడం లేదు. క్షేత్రస్థాయిలో ఈ తరహా పరిస్థితులు కొనసాగితే బలమైన కేడర్ బలహీనమయ్యే అవకాశాలు ఉంటాయి అన్నది పరిశీలకులు చెబుతున్న మాట. ఇది ఒక రకంగా పార్టీలకు ప్రభుత్వాన్ని కూడా ఇబ్బందికరంగానే మారుతుందని వారు అంచనా వేస్తున్నారు. వచ్చే ఎన్నికలలోపే ఈ విషయాన్ని పరిష్కరించి అంతర్గతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత పార్టీ అధిష్టానం తీసుకోవాలని చెబుతున్నారు. సమన్వయం చేసుకునే బాధ్యత ముఖ్యంగా నాయకులపై పెట్టాలని కూడా చెబుతున్నారు. లేకపోతే ఇబ్బందికర పరిస్థితులు తప్పవని హెచ్చరిస్తున్నారు. మరి ఏం చేస్తారు అనేది చూడాలి. ఇప్పటికైతే నివురు గప్పిన నిప్పులా అయితే పరిస్థితి ఉందన్నది వాస్తవం.

# సీఎం చంద్రబాబును కలిసిన కలెక్టర్, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా, గోపాలపురం నియోజక వర్గం నల్లజర్ల మండల కేంద్రంలో 'రైతన్న మీ కోసం' ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారిని మర్యాద పూర్వకంగా రాజమహేంద్రవరం రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రాజమహేంద్రవరం నగర శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, నగర మున్సిపల్ కమిషనర్,జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ తదితరులు ఆయనను కలిసారు.

### ఫజుల్లాబాద్ సుబ్రమణ్య షష్టి కబడ్డీ పోటీ విజేతలకు

## కంబాల బహుమతులు ప్రధానం

### 50 వేలు నగదు, ట్రోఫీలు, మెడల్స్ అందజేత



**దేవి పట్నం, విశ్వంవాయిస్ న్యూస్ :** శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి మహోత్సవాలు సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా, దేవీపట్నం మండలం ఫజుల్లాబాద్ గ్రామంలో విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గత నెల 26వ తేదీన ప్రారంభమైన కబడ్డీ టోర్నమెంట్ పోటీలు మంగళవారం రాత్రి ముగిసాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కంబాల శ్రీనివాసరావు హాజరయ్యారు. హోరా హోరీగా జరిగిన ఫైనల్ పోటీలను తిలకించారు. ఫైనల్లో తాళ్లరేవు మండలం రామన్నపాలెం టీం మొదట స్థానంలో నిలబడగా, ఠాగూర్ పాలెం టీం రెండోవ స్థానం, గాదరాడ టీం మూడోవ స్థానం, పెంటపల్లి టీం నాలుగోవ స్థానంలో విజేతలుగా గెలుపొందాయి. ఫైనల్లో గెలుపొందిన విజేతలకు కంబాల శ్రీనివాసరావు బహుమతులు ప్రధానం చేశారు. మొదటి విజేతకు ఇరవై వేలు, రెండొవ బహుమతి పదిహేను వేలు, మూడోవ విజేతకు పది వేలు, నాలుగో విజేతకు ఐదు వేలు రూపాయలు చొప్పున ఏభై వేలు రూపాయలు నగదు పంపిణీ చేసి, అనంతరం టోపీలు, మెడల్స్ అందజేశారు. అలాగే నలుగురు కబడ్డీ అంపైర్లు ఒకొక్కరికి ఇరవై ఐదు వందలు చొప్పున పది వేలు రూపాయలు అందజేశారు. బెస్ట్ రైడర్ కు మూడు వేలు, బెస్ట్ డిపెండర్ కు రెండు వేలు రూపాయలు నగదు అందజేశారు. బెస్ట్ ఆల్ రౌండర్, బెస్ట్ పెర్ఫార్మెన్స్ కు ట్రోఫీలు అందజేశారు. అలాగే కబడ్డీ కోర్టులో ముగ్గులు వేసిన ఇద్దరి యువతకు ఒక్కొక్కరికి వెయ్యి చొప్పున రెండు వేలు రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడాకారులకు,యువతకు, పేదలకు తాను ఏప్పుడు అండదండగా ఉంటానని అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన యువతకు ప్రోత్సాహం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు వరసాల ప్రసాద్, దాసరి ధర్మ రాజు, బత్తుల నానాజీ, పెద్దాడ వెంకన్న దొర, కంబాల యువసేన అధ్యక్షులు ఉంగరాల మణికంఠ, కర్రి మణికంఠ, దోసపాటి సుబ్బారావు, మండే గౌతమ్, మందపాటి సతీష్, కమిటీ సభ్యులు ఈత శివాజీ, ప్రగాఢ వీరబాబు, ఉల్లింగాల వీరబాబు, గుర్రం శివ, తాకారపు దివ్యశ్వర్ రావు, బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతన్న సేవ కేంద్రాలలో రైతన్న మీ కోసము వర్క్ షాప్



**దేవి పట్నం, విశ్వంవాయిస్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ పరిధిలో దేవి పట్నం మండల మండల వ్యవసాయ అధికారి కే.వెంకటేశ్వర్లు తెలియజేయునది ఏమనగా, ఈ రోజు దేవీపట్నం మండలంలో ఉన్న రైతు సేవా కేంద్రాలలో రైతన్న మీకోసం వర్క్ షాప్ నిర్వహించబడింది. ఇందులో ముఖ్యంగా గత నెల 24 నుండి 29 వరకు ప్రతి గ్రామంలో ,ప్రతి ఇంటికి రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలలో రైతులతో మరియు గ్రామ పెద్దలు, ఆదర్శ రైతులు, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు తో వర్క్ షాప్ నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్రభుత్వం నిర్దేశించిన ఐదు పంచ సూత్రాలు అనగా నీటి భద్రత ,డిమాండ్ ఉన్న పంటలు పండించడం ,అగ్రికల్చరల్ టెక్నాలజీ, ఫుడ్ ప్రాసెసింగ్, రైతులకు ప్రభుత్వం మద్దతు , పాడి పశువులు ,,ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహించుట, రుణ సదుపాయం, మొదలగు అంశాల పై ప్రతి రైతు సేవ కేంద్రంలో చర్చించి ,ఒక ప్రణాళిక తయారు చేయడం జరుగుతుంది అలాగే రాబోయే మూడు సీజన్లో వేసే పంటలు, దానికి సంబంధించిన నివేదికలను రూపొందించడం జరుగుతుంది. అన్ని రైతు సేవా కేంద్రాలలో వచ్చిన నివేదికలను మండలం నివేదిక తయారుచేసి తదుపరి నియోజకవర్గస్థాయి నకు పంపించి అక్కడ నుండి జిల్లా స్థాయి వరకు పంపించి ,చివరిగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో శరభవరం గ్రామ సర్పంచ్ శ్రీమతి కొమరం లక్ష్మీదేవి, గ్రామ ఉపసర్పంచ్ కేతమళ్ళ వెంకన్న బాబు, గోళ్ళ చంటి బాబు( టిడిపి మండల ప్రెసిడెంట,, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శ్రీ జొన్నల రాంబాబు, కీర్తి గంగాధర్ టిడిపి ప్రధాన కార్యదర్శి, శ్రీ జొన్నల శ్రీనివాస్ తెలుగుదేశం యూత్ కమిటీ, తుర్రం పెంటన్న దొర (మాజీ సర్పంచ్ & ప్రోగ్రెస్ రైతు) మడకం శ్రీనివాస్ (సొసైటీ డైరెక్టర్ ,) అయినాల వెంకటేశ్వరరావు (బిజెపి ప్రధాన కార్యదర్శి) ,ముంద్రు మధుసూదన్ రావు (తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు & మండల మాజీ ప్రెసిడెంట్) కొమరం జగ్గారావు (జనసేన కార్యకర్త) , మరియు వ్యవసాయ సహాయకులు హేమలత,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## అవగాహన అనుభవంతోనే కష్టపడిన వారికి పదవులను అందించాం..



**దేవి పట్నం, విశ్వంవాయిస్ న్యూస్ :** దేవీపట్నం టిడిపి మండల అధ్యక్షుడు గోళ్ళ చంటిబాబు, మండల ప్రధాన కార్యదర్శి కీర్తి గంగరాజు డిసెంబర్ మూడో తారీఖున బుధవారం నాడు అవగాహన అనుభవం పాలించే రాజకీయ నాయకులతో ఇబ్బందులు పడుతున్న తెలుగు తమ్ముళ్లు అని ఒక పత్రికలో వచ్చిన కథనానికి దేవీపట్నం టిడిపి మండల అధ్యక్షుడు గోళ్ళ చంటిబాబు, స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీలో కొంతమంది కావాలని నాపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను మండల అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్నప్పటినుండి నాపై తప్పుడు తప్పుడు ప్రచారాలు చేస్తూ పార్టీలో విభేదాలు సృష్టిస్తున్నారని ఆయన అన్నారు.పార్టీకి పనిచేయకపోతే న్యాయం జరగదని, పనిచేసిన వారికి రాష్ట్ర హైకమాండే నేరుగా పదవులు కేటాయిస్తుందని సూచించారు. గతంలో మండల పార్టీ ఎన్నికలు తమకు అనుకూలంగా రాలేదని కొందరు చేస్తున్న కుట్ర ఇది ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.ఎవరు కూడా ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని కార్యకర్త లకు ఆయన స్పష్టం చేశారు. నాయకులు కార్యకర్తలు అలక వీడి ఐక్యంగా పనిచేయాలని ఆయన సూచించారు. ఏదైనా నిర్ణయం తీసుకున్న తర్వాత ప్రతీ ఒక్కరూ దాన్ని తు.చ. తప్పకుండా పాటించాలన్నారు. అందరం ఒకే లక్ష్యంతో పనిచేస్తేనే విజయాలు సాధిస్తాం" అని ఆయన అన్నారు. క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జ్‌లతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.అహంకారం వద్దని ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. మనం ఎదిగేకొద్దీ ఒదిగి ఉండాలి. ప్రజల హృదయాలను గెలుచుకోవాలి అని హితవు పలికారు.ఎమ్మెల్యే మిరియాల శిరీష భాస్కర్ ఆదేశాల మేరకే తాము పని చేస్తున్నామని సొంత ధోరణిలో నిర్ణయాలు తీసుకోమని ప్రస్తుతం మండలం మొత్తం ఐక్యంగా ఉందని కావాలని కొంతమంది కుట్రపూరిత కార్యక్రమాలు చేస్తున్నారని ఆయన అన్నారు. ఇప్పటికైనా వారి ధోరణి మార్చుకొని కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆయన సూచించారు.పార్టీలో ఎవరు విభేదాలు సృష్టించవద్దని అందరూ కలిసికట్టుగా పనిచేద్దామని దానికి అందరూ సహకరించాలని మండల పరిధిలో మండల అధ్యక్షులు గాని, నియోజవర్గ స్థాయిలో ఎమ్మెల్యే గారు గాని అందర్నీ కలుపుకొని పార్టీని ముందుకు తీసుకెళుతున్నామని, పార్టీ ప్రతిష్టని ఎవరు భంగం కలగజేసిన తప్పక చర్యలు ఉంటాయని ఆయన పార్టీ నాయకులను కార్యకర్తలను కోరారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఎల్లేటి కృష్ణమోహన్,ఇందుకూరుపేట సొసైటీ అధ్యక్షులు మాగాపు బాబురావు, దేవీపట్నం సొసైటీ అధ్యక్షులు కొండ్ల చిన్న కొండ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు ముంద్రు మధుసూదన్ రావు మాజీ మండల అధ్యక్షులు తైలం గంగాధర్ రావు మండల ఎస్టీసెల్ అధ్యక్షులు సోదే వెంకన్న దొర, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ జొన్నల రాంబాబు, కో క్లస్టర్ ఇన్చార్జి అడబాల వీరభద్రరావు, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు మిత్తివాడ వీరబాబు మండల రైతు అధ్యక్షులు చారపు రామారావుదొర, మండల రైతు ప్రధాన కార్యదర్శి ఈరేటి బ్రహ్మాజీరావు ఐటీడీపీ మండల అధ్యక్షులు అంజిరెడ్డి తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కుటుంబ రెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు జొన్నల శ్రీనివాస్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి దొరబాబు,ఉపాధ్యక్షులు కోట్ల రామకృష్ణారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు ముచ్చు త్రిమూర్తులు, ప్రధాన కార్యదర్శి ముత్తం శెట్టి రాంబాబు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పెనుమతి రాజు ప్రధాన కార్యదర్శి కత్తుల రాజు తెలుగు ఉపాధ్యాయులు కామిశెట్టి శ్రీను,నేసిక బాబురావు సొసైటీ డైరెక్టర్లు పల్లపాటి నాగేశ్వరరావు మడకం శ్రీనివాస్ దొర ఏరియా ఇన్చార్జిలు కర్రీ రాజీవ్, మల్లేశ్వరరావు బూతు కన్వీనర్లు పాతాళ వీరపండు మల్లేశ్వరరావు దబ్బా నాని, బంటుమల్లి లక్ష్మణ్ మండల ప్రచార కార్యదర్శి పేరుగాని ఏసు, కొమరం మల్లేశ్వరరావు, మండల రైతు కార్యదర్శి గణిశెట్టి వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

### హత్య కేసులో మహిళకు

## ఏడు సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** హత్య కేసు నేరం రుజువు కావడంతో మహిళకు ఏడు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. ఏపీపీ పి.వి.వి.ఎస్.బీ రాజు తెలిపిన వివరాల ప్రకారం రాజవొమ్మంగి పోలీస్ స్టేషను పరిధిలో 2024లో జరిగిన హత్యా నేరం రుజువు కావడంతో మహిళా ముద్దాయికి 7 (ఏడు) సంవత్సరాల కఠిన కారాగార శిక్ష తో పాటు రూ1,000/-(రూపాయలు వెయ్యి) జరిమానా విధించినట్లు తెలిపారు. జరిమానా చెల్లించపక్షంలో మరో, 3 నెలల సాధారణ కారాగార శిక్ష విధించారు. 2024లో రాజవోమ్మంగి గ్రామానికి చెందిన వృద్ధురాలు కొర్రా జ్యోతి తన అత్త ఈక లక్ష్మి ని ఫెంక్షన్ డబ్బులు యివ్వమని తన ఇంటి వద్ద కట్టెల కర్ర తో తల పై కొట్టింది ఈ సంఘటనలో వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటనపై చార్జ్ షీట్ ను ఎన్. సన్యాసి నాయుడు నమోదు చేశారు. అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు, కోర్టులో విచారణలో ఉన్న కేసును త్వరితగతిన పూర్తి చేసి నేరస్థులకు శిక్ష పడేలా రాజవొమ్మంగి ఇన్స్పెక్టర్, సబ్-ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకున్నారు.ఈ నేపథ్యంలో, రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్లో క్రైమ్ నెం. 45/24, యు/ఎస్ 103 బీఎన్ఎస్ (ఐపీసీ302) కేసులో మాతే గంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొర్రా జ్యోతిపై విచారణ జరిగి, నేరం రుజువు కావడంతో 9వ కోర్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్, ఫ్యామిలీ కోర్ట్ జడ్జి ఎం. మాధురి, ముద్దాయికి 7సంవత్సరాల జైలుశిక్ష విధించినట్లు అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్,తెలిపారు. ఈ కేసులో శిక్ష లభించడానికి ఏపీపీ పి.వి.వి.ఎస్.బీ రాజు సమర్థవంతంగా వాదనలు వినిపించి, సాక్ష్యాలను నిరూపించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ కేసులో విచారణ త్వరగా జరగడానికి సాక్షులను కోర్టులో హాజరు పరచడంలో తోడ్పడిన రాజవొమ్మంగి ఎఐ గౌరీశంకర్, ఇన్స్పెక్టర్ శివకుమార్, ఎస్ఐ, ఎం. ముక్తేశ్వరరావు, సిఎంఎస్ ఇన్స్పెక్టర్‌బీ హెడ్ కాన్స్టేబుల్ జి.ఎస్.ఎస్.పి రెడ్డి, కానిస్టేబుల్ బాలాజీ లను అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, ప్రత్యేకంగా అభినందించారు. ముద్దాయిని రాజమహేంద్రవరం, మహిళా జైలుకు తరలించారు.

## భవిత సెంటర్‌కు జమాల్ ఖాన్ భరోసా

### అంగవైకల్య పిల్లలకు ఆసరా



**చింతూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జెకెసి ట్రస్ట్ చైర్మన్ తెలుగుదేశం మండల అధ్యక్షులు మహమ్మద్ జమాల్ ఖాన్ ఐఆర్‌సి. భవిత సెంటర్ను సందర్శించినారు. భవిత సెంటర్ కు తన వంతు భరోసా ఆసరా ఎల్లప్పుడూ ఉంటుందని తెలియజేస్తూ వికలాంగుల పిల్లలతో కలిసి భోజనం చేశారు. వికలాంగ పిల్లల తల్లిదండ్రులకు పిల్లలకు భోజన ఏర్పాట్లు చేసి 35 మంది వికలాంగ పిల్లలకు రగ్గులను అందజేశారు. చలికాలం కావడంతో పిల్లలు చలికి ఇబ్బంది పడుతున్నారని గుర్తించి ఆయన స్వయంగా భవిత సెంటర్ నిర్వాహకులకు దుప్పట్లను అందజేశారు. మానసిక శారీరక వికలాంగులు పట్ల అందరూ మానవత్వంతో తగిన సహాయం చేయాలని భగవంతుడు అన్ని అవయవాలతో పరిపుష్టిగా సృష్టించిన మనుషులు వారిపట్ల దయా కరుణ చూపించాలని తెలిపారు. అంగవైకల్యం మనుషులకు అడ్డంకి కాదని ఎంతోమంది ఈ భవిత సెంటర్ నుండి పదవ తరగతి మరియు ఉన్నత చదువులను అభ్యసించడం పట్ల ఆయన అభినందించారు. వికలాంగుల పట్ల చూపిస్తున్న శ్రద్ధ ఎంతో గొప్పదని ఎంతో ఓర్పు సహనం కావాలని అంతటి అవకాశం కలగటం కూడా అదృష్టమేనని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షులు ఎండి జహంగీర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు పి సాల్మన్ రాజు, ఎస్ కే జానీ, ట్రస్ట్ సభ్యులు, భవిత సెంటర్ నిర్వాహకులు శ్యాంసుందర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో ఘనంగా ఎంపీ తనుజారాణి జన్మదినోత్సవ వేడుకలు



**ఎటపాక, విశ్వం వాయిస్ న్యూస్ :** అరకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మా తనూజ రాణి జన్మదినోత్సవ సందర్భంగా ఎటపాక మండలం కేంద్రంలో ఉన్నటువంటి గ్రేస్ అనాథ వృద్ధాశ్రమంలో రాష్ట్ర యువజన నాయకులు, గొల్లపల్లి శివబాబు, ఎంబడి వినోద్ కుమార్ ఎంపీ జన్మదినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా కేక్ కట్ చేశసి అనంతరం వృద్ధులకు బన్నులు పంచడం జరిగింది.

## జక్కంపూడి జోరుగా పలు కుటుంబాలకు పరామర్శ




**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం మండలంలో వివిధ అనారోగ్యాలతో బాధపడుతున్న వారిని, ఇటీవల పలు గ్రామాల్లో మృతుల కుటుంబసభ్యులను వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు రాజానగరం మాజీ శాసన సభ్యులు జక్కంపూడి రాజా పరామర్శించి వారి కుటుంబాలను ఓదార్చారు. బుధవారం దివాన్ చెరువులో ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను, అనారోగ్యంతో బాధపడుతూ పలువురిని పరామర్శించారు. కోరుకొండ మండలంలోని గాడాల, కోటి కేశవరం, కోటి గ్రామాల్లో ఇటీవల కాలంలో మరణించిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించి వారికి పార్టీ అన్నివిధాల అండదండగా ఉంటుందని మీకు ఏ కష్టం వచ్చినా జక్కంపూడి కుటుంబం అండదండగా ఉంటుందని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కర్రి నాగేశ్వరరావు, నక్కా రాంబాబు, కొండపల్లి దుర్గారావు, మన్నె రమేష్ చౌదరి, మూడే సింధు కామేష్, గుడాల పెద్ద చిన్నయ్య, మింగి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సెల్ ఫోన్‌లను పరిమితంగా వినియోగించాలి




**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** సెల్ ఫోన్లకు సంబంధించిన తరంగాలు మన మెదడుపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున వాటిని పరిమితంగా వినియోగించాలని విశ్రాంతి ఉపాధ్యాయులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. రమణయ్యపేటలో వివిఎల్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సెల్‌ఫోన్లలో సమస్త సమాచారం నిక్షిప్తమై ఉందన్నారు. అయితే విద్యార్థులు వాటి ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. సెల్ఫోన్లకు బానిస కాకుండా చదువుపై మనసును నిమగ్నం చేయాలని వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్, ప్రిన్సిపాల్ కెవి రాఘవరావు, ఎన్ఎస్ఎస్ అధికారిని కె. సుకన్య స్థానిక పెద్దలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## తాత్కాలిక అకాడమిక్ కో-ఆర్డినేటర్ ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

### డిసెంబర్ 8 2025 నుండి జూన్ 07 2026 వరకూ కాలపరిమితి తో కొలువు
### బి.ఎ, బి.ఇ.డి లేదా బి.కామ్, బి.ఇ.డి పూర్తి చేసిన నిరుద్యోగులు అర్హులు
### మండల విద్యాశాఖ అధికారి సూర్యనారాయణ



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీర్చేందుకు తాత్కాలిక అకాడమిక్ ఇన్స్ట్రక్టర్ల నియామకంపై ప్రభుత్వ ఆదేశాల మేరకు, మండలంలోని మాచవరం ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న సోషల్ అకాడమిక్ కో ఆర్డినేటర్ ఏకైక ఉద్యోగానికి దరఖాస్తులు కోరుతున్నట్లు రాయవరం మండల విద్యాశాఖ అధికారి వై సూర్యనారాయణ బుధవారం తెలిపారు. ఈ తాత్కాలిక ఉద్యోగానికి గానూ బి.ఎ, బి.ఇ.డి లేదా బి.కామ్, బి.ఇ.డి పూర్తి చేసిన నిరుద్యోగులు అర్హులని పేర్కొన్నారు. డిసెంబర్ 8 2025 నుండి జూన్ 07 2026 వరకూ మాత్రమే ఉద్యోగ కాల పరిమితి కలదని వివరించారు. గౌరవం వేతనంగా నెలకు రూ.12,500/- లు చెల్లిస్తారని, ఆశక్తి గల అభ్యర్థులు విద్యార్హత ధృవీకరణ పత్రాలతో పాటు ప్రో ఫార్మా ను కలిపి రాయవరం మండలం విద్యాశాఖ అధికారి కార్యాలయంలో డిసెంబర్ 5వ తేది నాటికి దరఖాస్తు సమర్పించాలని రాయవరం మండల విద్యాశాఖ అధికారి వై సూర్యనారాయణ తెలిపారు.

## రాయవరంలో రైతన్న మీకోసం వర్క్ షాప్



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాయవరం మండలంలో పలు గ్రామాలలో రైతన్న మీకోసం వర్క్ షాప్ నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి కెవిన్ రమేష్ కుమార్ బుధవారం తెలిపారు. మండలంలోని సోమేశ్వరం, లొల్ల గ్రామాల వర్క్ షాప్‌లో యూరియా కొరత లేకుండా అందుబాటులో ఉంచుతామని రైతులకు హామీ నిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు వ్యవసాయ, అనుబంధ రంగాల నుండి “పంచ సూత్రాలు” గూర్చి నవంబరు 24 నుండి డిసెంబర్ 2వ తేదీ వరకు రైతుల సూచనలు తెలుసుకోవడం జరిగిందని, డిసెంబర్ 3వ తేదీన గ్రామంలో పంటల సాగుకి అవసరమైన వనరులను గురించి స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రైతులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## విజయదుర్గా పీఠంలో నేడు మార్గశిర పౌర్ణమి పూజలు

### భవాని శంకర అష్టలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం
### శ్రీదేవి భూదేవి సమేత విజయ వేంకటేశ్వరస్వామికి తులసిదళ అర్చనలు
### విజయదుర్గా పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాయవరం మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో గురువారం మార్గశిర పౌర్ణమి పూజలు నిర్వహించనున్నట్లు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పీఠంలో అడ్మినిస్ట్రేటర్ మాట్లాడుతూ పౌర్ణమిని పురస్కరించుకుని విజయదుర్గా అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, భవాని శంకర అష్టలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం, శ్రీదేవి భూదేవి సమేత విజయ వేంకటేశ్వరస్వామికి తులసిదళ అర్చనలు నిర్వహించబడతాయని తెలిపారు. అనంతరం విజయదుర్గా అమ్మవారికి మహిళలచే సామూహిక శ్రీచక్ర అర్చనలు జరుగుతాయన. దత్త జయంతి పురస్కరించుకుని పీఠంలో ఉన్న ఏకవుఖి దత్తాత్రేయుడికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరుగుతాయని, అనంతరం అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు ఈపూజల్లో భక్తులంతా పాల్గొనాలని అడ్మినిస్ట్రేటర్ బాపిరాజు పేర్కొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయానికి 40 వేల రూపాయల విలువగల ఇన్వెర్టర్ వితరణ

**చింతూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** చింతూరు తహసీల్దార్ కార్యాలయానికి జెకెసిటీ చైర్మన్, మండల తెలుగుదేశం అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ బుధవారం తహసిల్దార్ కార్యాలయానికి 40 వేల రూపాయల విలువైన ఇన్వర్టర్‌ను తాసిల్దార్‌కు అందజేశారు. కార్యాలయంలో వివిధ పనులపై వస్తున్న ప్రజలకు విద్యుత్ ఆటంకం లేకుండా త్వరితగతిన ప్రజలకు సేవలు అందించేందుకుగాను ఇన్వర్టర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని విద్యుత్ అంతరాయంతో ఆలస్యం అవుతున్న పనులు సత్వరం జరిగేలా తోడ్పాటు ఉంటుందని జమాల్ ఖాన్ ఇన్వర్టర్ వితరణ చేయడం జరిగింది. తాసిల్దార్ కార్యాలయానికి అడిగిన వెంటనే ఇన్వర్టర్ సదుపాయాన్ని అందించినందుకు తాసిల్దార్ సయ్యద్ హుస్సేన్, కార్యాలయ సిబ్బంది ధన్యవాదాలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో ఎండి జహంగీర్,సాల్మన్ జానీ విఆర్ఓ రామచంద్రయ్య,తదితరులు పాల్గొన్నారు.







బాయ్స్ హై స్కూల్ నందు

## చైర్మన్ ఎన్నికల కోసం కమిటీ



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట బాయ్స్ హై స్కూల్ నందు చైర్మన్ ఎన్నికల కోసం కొత్తపేట సర్పంచ్ బూసి జయలక్ష్మి భాస్కర్ రావు ఆధ్వర్యంలో చైర్మన్ కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయలక్ష్మి భాస్కరరావు కొత్తపేట టౌన్ ప్రధాన కార్యదర్శి ఎలిశెట్టి ప్రభాకర్ రావు స్కూల్ కమిటీ వైస్ చైర్మన్ రేఁయ్ అనంతలక్ష్మి కొత్తపేట మండలం రైతు అధ్యక్షుడు చౌడప్పనిడి భాస్కరరావు నీటి సంఘం నెంబర్ ముద్రగడ ఫణి పప్పుల సురేష్ సొసైటీ బ్యాంక్ అధ్యక్షులు కంఠం శెట్టి చంటి బాయ్స్ హై స్కూల్ ఓ అప్షన్ సభ్యులు చోడ పనీడి ఉమామహేశ్వరరావు సభ్యులు శ్రీదేవి మరియు హెచ్ఎం అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపేట గ్రామసర్పంచ్ బూసి జయలక్ష్మి భాస్కరరావు

## రైతన్న మీకోసం రైతు సదస్సు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రైతన్న మీకోసం రైతు సదస్సు పాల్గొన్న మండల టిడిపి రైతు విభాగం అధ్యక్షుడు చొడపనీడి భాస్కరరావు సీనియర్ నాయకులు కంఠంశెట్టి శ్రీనివాసరావు జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి రాష్ట్ర బిజెపి నాయకులు పాలూరి సత్యానందరావు సొసైటీ బ్యాంక్ ప్రెసిడెంట్ కంఠంశెట్టి చంటి టౌన్ పార్టీ అధ్యక్షులు వాసంశెట్టి సత్యనారాయణ టౌన్ పార్టీ కార్యదర్శి ఎలిశెట్టి ప్రభాకర్ ఆత్మ కమిటీ నెంబరు బూసి మరియమ్మ విష్ణు చిక్కం హనుమంతరావు ముద్రగడ పణి బయ్యా రాంబాబు పప్పుల సురేష్ కూటమి నాయకులు కొత్తపేట గ్రామ రైతులు మరియు అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ రెవెన్యూ డిపార్ట్మెంట్ తదిరులు పాల్గొనదురు.

అగ్ని ప్రమాదం వల్ల దగ్ధమైన ఇంటిని పరిశీలించి

## బాధితులను పరామర్శించిన చిర్ల



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ఆత్రేయపురం గ్రామంలో పమ్మి రాము ఇల్లు అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోవడం జరిగింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి బాధితులను పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి మానవతా దృక్పథంతో సహాయం చేస్తూ రు10,000 రూపాయల నగదు అందజేశారు.చిర్ల జగ్గిరెడ్డి బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పుతూ,చాలా బాధాకరమైన విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ తరపున ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

శ్రీ హనుమాన్ 35వ వార్షికోత్సవ మహోత్సవంలో పాల్గొన్న

## యువనాయకులు బండారు సంజీవ్

అన్నదానం ప్రారంభం, పేదలకు దుప్పట్ల పంపిణీ



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మోడేకుర్రు రాకుర్తివారిపాలెం గ్రామంలో నిర్వహించిన శ్రీ హనుమాన్ 35వ వార్షికోత్సవ మహోత్సవ కార్యక్రమంలో కొత్తపేట తెలుగుదేశం పార్టీ యువనాయకులు బండారు సంజీవ్ పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో హనుమాన్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని బండారు సంజీవ్ ప్రారంభించారు. సామాజిక సేవలో భాగంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేసి వారికి సహాయం అందించారు. అలాగే మోడేకుర్రు హైస్కూల్ ఆర్చ్ నిర్మాణానికి రూ.25,000 విరాళం అందించిన కురస చిన్నని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, భక్తులు అందరికీ బండారు సంజీవ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## వాడపల్లి వెంకన్నను దర్శించుకున్న హైకోర్టు జడ్జ్ గోపాలకృష్ణారావు



**కొత్తపేట/ ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని బుధవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ వి గోపాలకృష్ణరావు కుటుంబ సమేతంగా శ్రీ స్వామి వారిని దర్శించుకున్నారు. అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనానంతరం పండితులు వేదాశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** రైతులను ఆదుకునేలా కూటమి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతూ రైతులకు అండగా నిలుస్తుందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. మండపేట పట్టణంలో శ్రీ వల్లూరి అప్పారావు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ళ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న 5 సంవత్సరాలలో రైతును రాజును చేసేందుకు కూటమి ప్రభుత్వం కార్యచరణ చేపట్టిందన్నారు. మండపేట నియోజకవర్గంలో గత వారంరోజుల నుండి రైతన్న మీకోసం కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు ప్రతీ రైతు ఇంటికి వెళ్ళి రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించటమే కాకుండా వారి నుండి మంచి చెడ్డలు తెలుసుకున్నారన్నారు. రాష్ట్రంలో ప్రతీ ఎకరాకు సాగునీరు అందించే దిశగా అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేస్తున్నాం అన్నారు. సమాజంలో నేడు మారుతున్న ఆహార అలవాట్లకు అనుగుణంగా అన్నదాతలు సాగు పద్ధతులు మార్చుకోవాలన్నారు. సాగుకు టెక్నాలజీ తోడైతే రైతులకు తిరుగుండదన్నారు. అందుకే అగ్రిటెక్ ను ప్రోత్సహిస్తున్నారన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ల సేద్యాన్ని విస్తరించి, నీటి వినియోగ సామర్ధ్యాన్ని 40-50% వరకు పెంచి రైతు ఉత్పాదకతను పెంచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు బిందు సేద్యం పై గత ప్రభుత్వం రద్దు చేసిన 100 శాతం సబ్సిడీని ఈ ప్రభుత్వం పునరుద్ధరించిందన్నారు. ప్రకాశం, రాయలసీమ జిల్లాల మధ్యతరగతి (10 ఎకరాల లోపు) రైతులకు గత ప్రభుత్వం సబ్సిడీని తగ్గించగా దాన్ని ఈ ప్రభుత్వం 90 శాతానికి పెంచిందన్నారు. యంత్రాలు, టెక్నాలజీ వాడుకతో వ్యవసాయంలో పెట్టుబడి తగ్గుతుందన్నారు. రైతుల పంటలకు విలువ పెరగాలంటే ఫుడ్ ప్రాసెసింగ్ జరగాలని దీని కోసం రూ.13 వేల కోట్ల పెట్టుబడులతో 38 ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు సీఐఐ సదస్సులో ఎంఓయూలు కుదుర్చుకున్నారన్నారు. మండపేట నియోజకవర్గం నకు సంబంధించి రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ - పి.యం.కిసాన్ పథకం కింద రెండు విడతల్లో ఒక్కొక్కరికి రూ.14 వేల చొప్పున 17 వేల 380 మంది రైతు కుటుంబాలకు మొత్తం రూ.24.91 కోట్లు ఇచ్చాం అన్నారు. కొత్త ఆలోచనలు పంచుకుంటూ మార్పుకు నాంది పలకడానికి కూటమి ప్రభుత్వానికి అన్నదాతలు అందరూ తోడ్పాటును ఇవ్వాలని ఎమ్మెల్యే వేగుళ్ళ కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటి అధ్యక్షులు కుక్కల రామారావు, డైరెక్టర్ పడాల జన్నయ్య, సిద్దిరెడి రామన్న, అధికారులు వ్యవసాయ శాఖ ఎ.డి సి హెచ్ కేవీ చౌదరి, మండపేట మండల వ్యవసాయ శాఖ అధికారి కె.ప్రభాకర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన అధ్యక్షుడిని నియమించి

# కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తాం..



**అంబాజీపేట, విశ్వ వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నూతన జిల్లా అధ్యక్షున్ని కార్యకర్తల అభిప్రాయాలు తీసుకుని త్వరలోనే ప్రకటిస్తామని ఎఐసిసి పరిశీలకులు అఖిలేష్ శుక్ల వెల్లడించారు. బుధవారం పి గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం అంబాజీపేటలోని శాలివాహన భవనంలో జరిగింది. ఈసమావేశానికి ఏఐసీసీ ఎస్సీ సెల్ కో కన్వీనర్ జంగా గౌతం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అఖిలేష్ శుక్ల ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి మంగళవారం రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు స్థానంలో జిల్లాలో పార్టీ అధ్యక్షుడు ఎంపిక కోసం కార్యకర్తల అభిప్రాయాల్ని తీసుకొని త్వరలోనే జిల్లా అధ్యక్షుడిని నియమిస్తామని అన్నారు జిల్లాలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గం లోని కార్యకర్తల నాయకుల అభిప్రాయాలను తీసుకున్నామని జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ లకు జిల్లాకు సంబంధించిన తన నివేదికను త్వరలోనే పంపిస్తామని శుక్లా వెల్లడించారు. సంఘటన్ సృజన్ అభియాన్ అనే కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా నూతన జిల్లా అధ్యక్షులు ఎంపిక జరుగుతుందని అఖిలేష్ శుక్ల చెప్పారు. ఈ సమావేశంలో పిసిసి పరిశీలకులు మల్లిపూడి రాంబాబు, అరిగెల అరుణ, పీసీసీ ఉపాధ్యక్షులు కొత్తూరు శ్రీనివాసరావు, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మెన్ కామన ప్రభాకర్ రావు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముష్ని రామకృష్ణారావు, మాచవరపు శివన్నారాయణ, యార్లగడ్డ రవీంద్ర, ములపర్తి మోహన్రావు, నెల్లి వెంకటరమణ, ఆదుర్తి నారాయణమూర్తి, మహమ్మద్ ఇజ్రాయిల్ షరీఫ్ మహమ్మద్ ఇస్మాయిల్ షరీఫ్, వి.వి.ఎస్.చౌదరి, అప్పన రామకృష్ణ, నీతిపూడి బాల సత్యనారాయణ, దొమ్మేటి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి : కొత్తపేట మాల నాయకులు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం ఈనెల 13వ తేదీన డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో జిల్లా మాల సామాజికవర్గం నాయకులు ఆధ్వర్యంలో చేపట్టిన మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కొత్తపేట నియోజకవర్గ మాల సామాజిక వర్గం పిలుపునిచ్చారు. బుధవారం రావులపాలెం ఇందరా కాలనీ కమ్యూనిటీ భవనంలో డివిజన్ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు పాలంగి రవిచంద్ర అధ్యక్షతన జరిగిన మాలల ముఖ్యనాయకుల సమావేశంలో వానపల్లి సర్పంచ్ పల్లి భీమారావు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మాసాబత్తుల ఆనందరావు, టిడిపి పార్టీ సీనియర్ నాయకులు పల్లి యేసు, బూసి భాస్కరరావు, టిడిపి మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు నల్ల వెంకటరమణ, చీఖరమెల్లి లోవరాజు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల్లోని అన్ని గ్రామాల ఎస్సీ నాయకులతో చర్చించినారు.అనంతరం ముఖ్యనాయకుల మాట్లాడుతూ ఈనెల 13న జరిగే మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశానికి భారీ సంఖ్యలో జనాన్ని సమీకరించాలన్నారు. మాలలంతా ఐకమత్యానికి నిదర్శనంగా ప్రతీ గ్రామం నుండి రికార్డు స్థాయిలో తరలిరావాలన్నారు.ఈ ఆత్మీయ సమ్మేళనంలో జిల్లా వ్యాప్తంగా సుమారు రెండు లక్షల మంది వరకు హాజరవుతారని అంచనా వేసారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మాల నాయకులు వడ్లమూడి రామారావు, నెల్లి చిన్న,బద్దా యేసు,కోనాల వెంకట్రావు,చిత్రపు ఆనందరావు, చిల్లి ప్రసాద్, పమ్మి శ్రీరామమూర్తి, కుసుమే సుబ్బారావు అధికసంఖ్యలో ఎస్సీ మాల నాయకులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు చేయూతనిస్తే అద్భుతాలు సృష్టిస్తారు

సోమేశ్వరంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు - దివ్యాంగుల పట్ల ఉపాధ్యాయుల తీరు అభినందనీయం
వాలంటరీ బ్లడ్ అండ్ ఐ డోనర్స్ అధ్యక్షులు వెలగల ఫణికృష్ణారెడ్డి




**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దివ్యాంగులు తమ శరీర దౌర్బల్యాన్ని బట్టి ఆగిపోక, పట్టుదలతో ముందుకు సాగేలా వారిని ప్రోత్సహిస్తే అద్భుత విజయాలను అందుకుంటారని వాలంటరీ బ్లడ్ అండ్ ఐ డోనర్స్ అధ్యక్షులు వెలగల ఫణికృష్ణారెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాయవరం మండలం సోమేశ్వరం గ్రామంలో గల భవిత కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారి వై.సూర్యనారాయణ ఆధ్వర్యంలో సోమేశ్వరం మెయిన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాటరేవు శేషమణి అధ్యక్షతన ప్రపంచ దివ్యాంగ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో ముఖ్య అతిథులుగా వాలంటరీ బ్లడ్ అండ్ ఐ డోనర్స్ అధ్యక్షులు వెలగల ఫణికృష్ణారెడ్డి, రంగంపేట జెడ్పీటీసీ సభ్యులు పేపకాయల రాంబాబు, సోమేశ్వరం గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు శాకా నాగేంద్రలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫణి కృష్ణారెడ్డి మాట్లాడుతూ సాధారణ పిల్లలకంటే దివ్యాంగులైన పిల్లలకు జ్ఞాపకశక్తి, సామర్థ్యాలు ఎక్కువగా ఉంటాయని వారికి చక్కని మార్గదర్శకం చేస్తే అద్భుతాలు సాధించగలరని వివరిస్తూ, ఎంతో ఓపికతో భాధ్యతగా కర్తవ్యాన్ని నిర్వహిస్తున్న సిబ్బంది సేవలు ఆదర్శనీయమని అన్నారు. అనంతరం శాకా నాగేంద్ర మాట్లాడుతూ గ్రామంలో దివ్యాంగుల పాఠశాల ద్వారా ఎందరో దివ్యాంగ విద్యార్థులకు శిక్షణ అందించడం సంతోషకరమని గ్రామంలోని కూటమి నాయకుల ద్వారా పాఠశాలకు అన్ని విధాల సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులకు పణి కృష్ణారెడ్డి బహుకరించిన పలు ఆట వస్తువులను విద్యార్థులకు అందించారు. దివ్యాంగ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలలో పాల్గొన్న అతిథులు ఈ సమయం తమకు ప్రత్యేకమైనదని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గ్రామ కార్యదర్శి కాళ్ళ మణిప్రసాద్, ఇంచార్జ్ లు పెద్దకాపు, గోపి, భవిత కేంద్ర ఐ.ఇ.ఆర్.టి (ఉపాధ్యాయులు) పోదూరి ఆదర్శ, తిరగటి వీరవేణి, తదితర సిబ్బంది, దివ్యాంగ విద్యార్థులు, తల్లులు, తదితరులు హాజరయ్యారు.

దేవరపల్లి వర్క్ షాప్‌లో

## యువనేత బండారు సంజీవ్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందనేదే కూటమి ప్రభుత్వ ఉద్దేశ్యం రైతుల అవగాహన కోసమే వర్క్ షాపులు.రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని తద్వారా దేశం బాగుపడుతుందనేది కూటమి ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యమని యువనాయకులు బండారు సంజీవ్ అన్నారు. బుధవారం దేవరపల్లి రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్ షాప్ లో ఆయన పాల్గొని ప్రసంగించారు. రబీ, ఖరీఫ్, రబీ వరుసగా మూడు పంట కాలాలను పరిగణనలోకి తీసుకుని పెట్టుబడి, దిగుబడులు, లాభనష్టాల అంచనాకు వ్యవసాయ అధికారులు రానున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అన్నదాతల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుందన్నారు. ఇప్పటికే పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ పథకం, పీఎం కిసాన్ పథకం కలిపి రెండు విడతల్లో రైతులు ఖాతాల్లో రూ.14వేలను జమ చేయడం జరిగిందన్నారు. త్వరలో మూడో విడతలో మిగిలిన రూ.6వేలను జమ చేయడం జరుగుతుందన్నారు. కోనసీమలో, మన నియోజకవర్గంలో వరి, అరటి కొబ్బరి ప్రధాన పంటలుగా ఉన్నాయని, వాటికి అనుబంధంగా స్మాల్ స్కేల్ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం రాయతీలు ఇస్తుందని, సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు, యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. రైతులు ప్రధానంగా సేంద్రియ,ప్రకృతి వ్యవసాయం పట్ల ఆసక్తి పెంచుకొని ఆ దిశగా కృషి చేయాలన్నారు. స్థానిక నాయకులు రహదారుల అభివృద్ధి కోసం అడిగారని ఈ అంశాన్ని ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు దృష్టికి తీసుకుని వెళ్లి తప్పకుండా రహదారుల అభివృద్ధి సైతం కృషి చేస్తానన్నారు.

స్వాతంత్ర పోరాటంలో గుర్తింపు పొందని

## సమరయోధుల త్యాగాలు వెలకట్టలేనివి

రామచంద్రపురం నియోజకవర్గ ఎంబీసీ సంఘం అధ్యక్షులు యాట్ల..



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** చిన్న ప్రాయంలోనే దేశ విముక్తి కోసం, బ్రిటిష్ వారిని ఎదిరించి స్వాతంత్ర్యం కోసం ఉరికంభమెక్కిన పోరాట యోధుడు ఖుదీరాం బోస్ అని రామచంద్రపురం నియోజకవర్గ ఎం.బీ.సీ సంఘం అధ్యక్షులు యాట్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. భారతీయ జాతీయవాది, స్వాతంత్ర్య సమర వీరులలో మొదటి తరానికి చెందిన అతి పిన్న వయస్కుడైన సమరయోధుడు ఖుదీరాం బోస్ 136వ జయంతి కార్యక్రమాన్ని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ద్రాక్షారామ లో యాట్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. తొలుత ఖుదీరాం బోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం యాట్ల మాట్లాడుతూ భారతదేశాన్ని వేధిస్తున్న బ్రిటిష్ అధికారుల పై బాంబు వేసిన మొదటి సాహస వీరుడు ఖుదీరాం అని అన్నారు. ఈ కారణంగా ఆయనను ఉరితీసే నాటికి వయస్సు కేవలం 18 సంవత్సరాలు మాత్రమేనని వివరించారు. భారతదేశ దాస్యం విముక్తికై నడుంబిగించి, స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసిన వారందరికీ ఉద్యమ నమస్కారాలు తెలిపారు. గుర్తింపు పొందని స్వాతంత్ర్య సమర యోధులను త్యాగాలను పలువురికి వివరించి, వారి చరిత్రను బాహ్య ప్రపంచానికి తెలియజేయడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మేడిశెట్టి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

## మీసాల మౌనికను అభినందించిన డి.ఇ.ఓ సలీం బాషా



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబాజీపేట జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని మీసాల మౌనిక స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ జి ఎఫ్) బాస్కెట్ బాల్ పోటీలలో అండర్ 19 జట్టుకు ఎంపికైంది. ఈమె ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అండర్ 19 జట్టుకు కెప్టెన్ గా ఆడి, ఉమ్మడి జిల్లాకు రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానం సాధించింది. 2026వ సంవత్సరం జనవరిలో రాజస్థాన్ లోని బర్మర్ పట్టణంలో జరిగే బాస్కెట్ బాల్ పోటీలలో మౌనిక పాల్గొంటుంది. ఈసందర్భంగా ఇటీవల అయినవిల్లి మండలం నేదునూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన విద్యార్థుల కోసం, విద్యార్థులచే నిర్వహించబడుతున్న సెలయేరు అంతర్జాల పత్రిక 6వ వార్షికోత్సవ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం బాషా, మీసాల మౌనికను అభినందించారు. ఈ కార్యక్రమంలో సెలయేరు ప్రధాన సంపాదకులు బామా శ్రీ, సెలయేరు పత్రిక ఎడిటర్ మామిడిశెట్టి బాలాజీ, డిస్ట్రిక్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కోఆర్డినేటర్, సీనియర్ ప్రధానోపాధ్యాయులు బీర హనుమంతరావు, పి.డి కుంపట్ల ఆదిలక్ష్మి, సామాజిక కార్యకర్త వీరిన గోపాలం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## పలువురుని పరామర్శించిన మాజీ ఎంపీ అనురాధ



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం మండలం పేరూరు పంచాయతీ తొట్లపాలెం గ్రామానికి చెందిన గోసంగి మంగదేవి, అమలా పురానికి చెందిన చిట్టూరీ నరసింహారావు ఇటీవల మరణించగా, వారి చిత్రపటాలకు నివాళులర్పించి, కుటుంబ సభ్యులను అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యులు చింతా అనురాధ బుధవారం పరామర్శించారు.ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచ్ బర్రె సీతారత్నం, గోగు కృష్ణవేణి, దాసరి దేవిడ్, గోసంగి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



### ఉప్పాడ ప్రాంత మత్స్యకారుల సమస్యకు

# శాశ్వత పరిష్కారం చూపుతాము

**ఉప్పాడ మత్స్యకారుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం - సముద్ర జలాల కాలుష్య సమస్యపై శాస్త్రీయ పరిశోధన**

**ఉప్పాడ మత్స్యకారులతో ప్రత్యేకంగా సమావేశమయిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**

**విశ్వం వాయిస్ న్యూస్ :** 'ప్రజా ధనం నుంచి ఖర్చు పెట్టే ప్రతి పైసాకు ప్రతిఫలం ఉండాలి. ఇచ్చిన ప్రతి మాటకు కట్టుబడి పనిచేయాలనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా ప్రజా ధనాన్ని ఖర్చు చేశారు. అప్పటి ప్రభుత్వం ఓ ప్రణాళిక లేకుండా, సొంత ప్రాపకాల కోసం ఇష్టానుసారం చేసిన ఖర్చులతో నిధులు అక్కరకు రాకుండా పోయాయ'ని ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ చెప్పారు. పోలవరం డయా ఫ్రం వాల్ ను గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లు మార్చి, రివర్స్ టెండర్లు అంటూ ఇష్టానుసారం నిర్మించడంతో ఎందుకు పనికిరాకుండా పోయిందనీ ఇప్పుడు దాన్ని పునర్నిర్మాణం చేయాల్సి వచ్చిందన్నారు. అలాగే ఉప్పాడలో నిర్మించిన మత్స్యకారుల జెట్టీ కూడా డిజైన్ల లోపం కారణంగా పనికిరాకుండా పోయింది, దానికి మళ్లీ రూ.80 కోట్లు ఖర్చయ్యే పరిస్థితిని తీసుకొచ్చారని చెప్పారు. చేసిన పనికే ప్రజాధనాన్ని మళ్లీమళ్లీ ఖర్చు చేసేలా అప్పటి పాలకులు పని చేశారని వివరించారు. ఉప్పాడ మత్స్యకారులతో- 100 రోజుల ప్రణాళిక అమలు, భవిష్యత్తు కార్యాచరణ, ఆదాయం పెంపు అనే అంశాలపై బుధవారం మంగళగిరి క్యాంపు కార్యాలయంలో పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. తమిళనాడు, కేరళలో విజయవంతంగా అమలు అవుతున్న సముద్ర ఉత్పత్తులతో అదనపు ఆదాయం విధానాలను పరిశీలించేందుకు ఉప్పాడ నుంచి 60 మందితో ప్రత్యేక బృందాన్ని అక్కడకు ఉప ముఖ్యమంత్రివర్యులు పంపనున్నారు. సమావేశంలో మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపే యాక్షన్ ప్లాన్ ను వారి సమక్షంలోనే పవన్ కళ్యాణ్ తెలియజేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "మత్స్యకారులకు సమస్య వస్తే నాకు వచ్చినట్లే. మా ఇంట్లోని వారికి సమస్య వచ్చినట్లే భావిస్తాను. అదే భావనతో సమస్యను పరిష్కరిస్తా. ఈ విషయాన్ని అక్టోబరు 9వ తేదీన ఉప్పాడ సెంటర్ నుంచి చెప్పాను. ఇప్పుడు అదే మాట మీద ఉన్నాను. సమస్య వస్తే రాజకీయాలకు అతీతంగా దాని పరిష్కారానికి ముందుకు వెళ్లేవాడిని. నాకు మీ సహకారం కావాలి. నన్ను శకించకండి.. నేను మీ వాడిని. మిగతా



పార్టీల నాయకుల్లా సమస్య వస్తే బూతులు తిట్టడం, గొడవలు పెట్టడం చేయను. పరిష్కారం వచ్చేలా పని చేస్తాను. దాని కోసం పరితపిస్తాను.

**కాలుష్యానికి మూలం తెలియాలి**

సముద్రపు కాలుష్యం చాలా రకాలుగా ఉంటుంది. మత్స్యకారులు ఉప్పాడ తీరంలో కాలుష్య సమస్య నా దృష్టికి తీసుకొచ్చిన వెంటనే దీని మూలాలను శాస్త్రీయంగా వెతికేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టాను. ఇప్పుడు డాక్టర్ జో కిజాకూడన్ బృందం రంగంలోకి దిగి ఉప్పాడ తీరంలో కాలుష్య సమస్యపై పూర్తిస్థాయి అధ్యయనం చేస్తుంది. దీని మూలాలు వెతికి, శాశ్వత పరిష్కారం వెతుకుదాం. మత్స్యకారులకు ఎలాంటి సమస్యా రాకుండా చూసుకునే బాధ్యతను నేను తీసుకుంటాను. పరిశోధన బృందానికి మత్స్యకారులు తగిన విధంగా సహకరించాలి. వారు తీర ప్రాంతంలో అంతా తిరిగి, సముద్రంలోకి వెళ్లి మరీ కాలుష్యానికి అసలు కారణాలను తెలుసుకుంటారు.

**సమస్యను మర్చిపోలేదు**

అక్టోబరు 9వ తేదీన ఉప్పాడ వేదికగా 100 రోజులు గడువు ఇవ్వాలని మత్స్యకారులను కోరాను. అప్పటి నుంచి నాతోపాటు నా కార్యాలయ అధికారులు దీనిపై కూలంకషంగా పని చేస్తున్నారు. సమస్య పరిష్కార దిశగా, మత్స్యకారులకు కొత్త భరోసా ఇచ్చే దిశగా ముందుకు వెళ్తున్నాం. సమస్యను నేనెప్పుడూ మర్చిపోలేదు. మత్స్యకారులు మారుతున్న కాలంతో మరింత వేగంగా వారి బతుకులను బంగారుమయం చేసుకునేందుకు వివిధ రాష్ట్రాల్లో విజయవంతంగా అమలు అవుతున్న పద్ధతులను అవలంబించాలి. దీనికోసం ఉప్పాడ మత్స్యకారుల నుంచి ప్రత్యేకంగా బృందాలను తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు పంపుతున్నాం. అక్కడి విధానాలను అవగతం చేసుకోవాలి. దానికి ప్రభుత్వం కూడా మీకు తగిన విధంగా సహకరిస్తుంది. అక్కడ పద్ధతులను క్షుణ్ణంగా తెలుసుకోవాలి. అదనపు ఆదాయ మార్గాల మీద దృష్టి సారించాలి. ఉప్పాడలోని 7200 మంది మత్స్యకారులు, 25,600 మంది వారి కుటుంబ సభ్యులకు జీవన భృతి రెట్టింపు అవ్వాలి అన్నదే లక్ష్యం" అన్నారు. ఈ సమావేశంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, సెంట్రల్ మెరైన్ ఫిషరీష్ రీసెర్చ్ ఇన్సిట్యూట్‌కు చెందిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ ప్రిన్సిపల్ సెంటిస్ట్ డాక్టర్ జో కిజాకుడాన్, ఫిషరీష్ అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్, మెరైన్ షిషరీష్ జాయింట్ డైరెక్టర్ సురేష్, కాకినాడ జిల్లా ఫిషరీష్ అధికారి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

**యాక్షన్ ప్లాన్ లోని కొన్ని ముఖ్యాంశాలు**

- ఉప్పాడ తీర ప్రాంత కాలుష్యానికి అసలు కారణాలు.. దాని నివారణకు తీసుకోవల్సిన చర్యలకు శాస్త్రీయ పరిష్కారం దిశగా వేగంగా అడుగులు. ఐసీఏఆర్ రీజనల్ సెంటర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ జో కిజాకుడాన్ బృందంతో ఉప్పాడ తీరంలోని 20 ప్రాంతాల్లో ప్రత్యేకంగా పరిశోధనలు, పరిష్కార మార్గాలు చూపేలా ప్రణాళికలు. తక్కువ సమయంలోనే ఫలితాలు సాధించేలా కృషి.
- సముద్రంలో చేపలు పట్టుకోవడానికి గతంలో కేవలం 12 నాటికల్ మైళ్ల వరకు మాత్రమే మత్స్యకారులకు అనుమతి ఉండేది. ఇప్పుడు 200 నాటికల్ మైళ్ల వరకు అనుమతి లభించింది. డీప్ సీ ఫిషింగ్ అనుమతి ద్వారా మత్స్యకారులకు అదనపు ఆదాయం లభించనుంది.
- రాష్ట్రంలో మొదటిసారి ఉప్పాడ తీరంలో 50 వేల పండుగప్ప పిల్లలను ఇటీవల విడిచిపెట్టడం జరిగింది. భవిష్యత్తులో టైగర్ రొయ్య పిల్లలను కూడా ఇదే విధంగా విడిచిపెట్టి మత్స్య సంపదను తీర ప్రాంతంలో గణనీయంగా పెంచేలా ముమ్మర ప్రయత్నం.
- కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక పథకం ద్వారా కోనపాపపేటలో బహుళార్థసాధక కమ్యూనిటీ హాళ్లు, ఆర్.ఓ ప్లాంటు, చేపలు ఎండబెట్టుకోవడానికి 3 రకాల ప్లాట్ ఫాంల నిర్మాణం. వేటకు వెళ్లే వారిని ట్రాక్ చేసేందుకు జీపీఎస్ పరికరాలు, ఐస్ బాక్సులను అందజేత.

**మత్స్యకారులకు అదనపు ఆదాయ మార్గాలు**

- తమిళనాడులో చెన్నై హార్బర్ దగ్గరగా, తిరువత్రియార్ కుప్పం తీరంలో విజయవంతంగా అమలు అవుతున్న ఆర్టిఫిషియల్ కోరల్ రీఫ్ ( కృత్రిమ పగడపు దిబ్బ)లను ఉప్పాడ తీరంలోనూ ఏర్పాటు. 1500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఒక టన్ను సామర్థ్యంతో పగడపు దిబ్బలు ఏర్పాటు ద్వారా 300 రకాల సముద్ర జాలాలను ఆకర్షించడం సాధ్యం అవుతుంది. వీటిలో 50 రకాల సముద్ర చేపలు మత్స్యకారులకు వాణిజ్యపరంగా ఉపయోగపడ తాయి. ఈ రకమైన సముద్ర వ్యవసాయం ద్వారా ఏడాదిలో రూ.2 కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా.
- సముద్రపు నాచు (సీ వీడ్) వ్యవసాయం అనే కొత్త పద్ధతి ద్వారా ఉప్పాడ మత్స్యకారుల ఆదాయానికి కొత్త మార్గం చూపిస్తాం. సముద్రపు నాచును ప్రాసెస్ చేయడం ద్వారా పోషక, ఔషధ గుణాలున్న ఆహారం, కాస్మోటిక్స్, మందులు, బయోఫ్యూయల్స్, ఎరువుల తయారీలో అది ప్రధాన మూలకంగా పనికొస్తుంది. దీనికి మార్కెట్ చాలా అధికంగా ఉంది. ఇది భవిష్యత్తులో సముద్ర ఆదాయ విప్లవానికి నాంది పలుకుతుంది.
- సీ గ్రాస్ బెడ్ పునరుద్ధరణ ద్వారా తీర ప్రాంత పర్యావరణానికి రక్షణ ఏర్పాటు చేయడం ప్రధానం. సముద్ర జీవులను రక్షించుకోవడం, జీవ వైవిధ్యం పెంపొందించుకోవడం అనేది భవిష్యత్తుకు చాలా అవసరం.
- ఉప్పాడ తీర ప్రాంత రక్షణకు సీ ప్రొటెక్షన్ వాల్ ప్రధానం. దీని కోసం రూ323 కోట్లతో ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి. ఉప్పాడ కోత నివారణకు రక్షణ గోడ అవసరాన్ని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ దృష్టికి పవన్ కళ్యాణ్ తీసుకెళ్లి నిధుల కోసం ప్రత్యేకంగా మాట్లాడనున్నారు.

# శ్రీ సీతారామ ఆలయ జీర్ణోద్ధరణకు రూ.80 లక్షలు మంజూరు

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని మండల కేంద్రం శంఖవరంలో సుమారు 2018 సంవత్సరం నుంచి శిధిలావ్థకు చేరుకున్న శ్రీ పంచాయతన సీతారామ చంద్ర స్వామి దేవాలయం జీర్ణోద్ధరణకు రూ. 80,000,00 మంజూరు అయ్యాయి. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయ ధర్మాదాయశాఖ కమీషనర్ రామచంద్ర మోహన్ కొదూరి గత నెల నవంబర్ 24 న ఆర్‌సి.నం.పి/సిఓఇ/1514/2025-35 ఉత్తర్వులను జారీ చేశారు. ఆలయం పునర్నిర్మాణానికి రూ. 80,000,00 లను మొత్తం అంచనా వ్యయంగా ప్రతిపాదిస్తూ ఇందులో రూ. 53,33,000లను దేవాదాయ ధర్మాదాయశాఖ ఉమ్మడి సంక్షేమ నిధి (కామన్ గూడ్ ఫండ్స్) నుంచి మంజూరు చేస్తూ, దీనికి సరిపోయే తోడ్పాటు నిధులు (మ్యాచింగ్ గ్రాంటు)గా రూ. 26,67,000 లను ప్రజా విరాళంగా సమకూర్చాలని ఆ శాఖ నిర్దేశించింది. ఒక నెల రోజుల లోపు తోడ్పాటు నిధులను బ్యాంకులో డిపాజిట్ చేసి ధృవీకరణ పత్రం సమర్పించాలని, లేని పక్షంలో దేవాదాయ ధర్మాదాయశాఖ ఉమ్మడి సంక్షేమ నిధి నుంచి నిధులు మంజూరు చేయమని ఉత్తర్వుల్లో



పేర్కొన్నారు. ఇదే విషయమై పూర్వపు తూర్పు గోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ పూర్వపు ప్రచార కార్యదర్శి పర్వత సురేష్ బుధవారం రాత్రి 7.30 గంటలకు శంఖవరంలోని తన స్వగృహంలో పాత్రికేయుల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. ఈ ఆలయం పూర్తిగా జీర్ణోద్ధరణకు చేరుకున్నదనీ, ధ్వజస్తంభం కూడా నేలకూలిపోయిందనీ, అలాగే స్వామి అమ్మ వార్ల రథం కూడా శిధిలమైందని, ఆలయ దేవాలయంలోని ధ్వజస్తంభం నేలకూలడం ఊరికి అరిష్టమనే గ్రామస్తుల మనోభావాలను, మనస్థాపాన్ని, ఆలయ జీర్ణోద్ధరణకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు విన్నవించామన్నారు. ఆమె వెంటనే మంత్రులు, రాష్ట్ర దేవాదాయశాఖ అధికారులతో మాట్లాడారు. స్వల్ప కాలం వ్యవధిలోనే నిధులు మంజూరుకు ఎమ్మెల్యే కృషి చేసారు అన్నారు. అందుకు ఆమెకు గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులుగా ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం అన్నారు. తోడ్పాటు నిధుల (మ్యాచింగ్ గ్రాంటు) సేకరణకు ప్రజా విరాళాలను సేకరిస్తామని, ఇంటింటిని సందర్శిస్తామని, భక్తులు, ప్రజలు, వ్యాపారులు, వ్యాపార సంస్థలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, చివరకు పాత్రికేయులు కూడా స్వచ్ఛందంగా తమ వంతు నగదు విరాళాలను అందించాలని పర్వత సురేష్ కోరారు. ఆలయ పునర్నిర్మాణానికి 26 రోజుల వ్యవధిలో తోడ్పాటు నిధుల విరాళాలను అందించడంలో గ్రామ పౌరులు అందరూ తమ వంతు నిర్మాణాత్మక పాత్రను విజయవంతంగా నిర్వహించాలని పూర్వపు తూర్పు గోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ పూర్వపు ప్రచార కార్యదర్శి పర్వత సురేష్ పిలుపును ఇచ్చారు. ఈ పాత్రికేయుల సమావేశంలో ఊరి ఉప సర్పంచ్ చింతంనీడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పంటల ప్రణాళికలో అనుబంధ శాఖల భాగస్వామ్యం అవసరం

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పంటల సాగు ప్రణాళికలో అనుబంధ శాఖలు కూడా విధిగా భాగస్వామ్యం కావాలని మండల వ్యవసాయ అధికారి పడాల గాంధీ సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాల ప్రగతిలో పంచ సూత్రాలైన నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రోసెసింగ్, ప్రభుత్వాల మద్దతు వంటి వాటి ఆధారంగా ప్రణాళిక తయారు చేయాలని ఆయన వివరించారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండల కొంతంగి, నెల్లిపూడి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతన్నా....మీ కోసం కార్యక్రమంలో భాగంగా బుధవారం కార్యశాలలను నిర్వహించారు. ఆత్మ" ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో రబీ 2025- 26, ఖరీఫ్ 2026, రబీ 2026-27 పంట కాలానికి పంటల సాగు ప్రణాళికలో వ్యవసాయ శాఖతో మండలంలోని మిగతా ప్రభుత్వ అనుబంధ శాఖలు భాగస్వామ్యం గురించి ఆయన ప్రధానంగా వివరించారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లోనూ ఈ వారం రోజుల్లోనూ కార్యశాలలను నిర్వహించా మన్నారు. ఈ కార్యక్రమాల్లో వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య సహాయకులు మణికంఠ, రాజు, సూరిబాబు, ప్రసాద్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

**ప్రణాళికలో అనుబంధ శాఖల ఉపయోగాలు...**

పంటల ప్రణాళికలో వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న పశుసంవర్ధక, మత్స్యశాఖ, సహకార, జలవనరుల శాఖ వంటివి భాగస్వామ్యం వహిస్తాయి. ఈ శాఖల సమన్వయంతో, ప్రభుత్వాలు విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి, విత్తన కాలాన్ని మెరుగు పరచడానికి, ఆహార భద్రతను నిర్ధారించడానికి, రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడానికి కృషి చేస్తాయి. అనుబంధ శాఖలు కలిసి పని చేయడం వల్ల, పంటల ప్రణాళికలు మరింత సమర్థవంతంగా రూపొందించ డానికి వీలవుతుంది. అనుబంధ శాఖలు సమన్వయంతో



పని చేయడం ద్వారా ప్రభుత్వ విధాన నిర్ణయాలకు ఇన్‌పుట్‌లు, తగు సూచనలు లభిస్తాయి. ఆహార భద్రతను నిర్ధారించడానికి పంటల ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచడంలో వ్యవసాయ శాఖతో పాటు, ఈ అనుబంధ శాఖలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడానికి వ్యవసాయ శాఖతో పాటు, ఇతర అనుబంధ శాఖలు విస్తరణ సేవలు, శిక్షణలు అందిస్తాయి. వ్యవసాయానికి అనుబంధంగా ఉండే అనుబంధ కార్యకలాపాలైన మష్రూమ్, ఫారెస్ట్రీ, వర్మీ కంపోస్టింగ్ వంటి వాటిని ప్రోత్సహించడం, రైతులకు విలువ జోడింపు సేవలను అందించడం ద్వారా ఆర్థిక స్థితిని మెరుగు పరుస్తాయి. విత్తన కాలాన్ని మెరుగు పరచడం ద్వారా, కేంద్ర ప్రభుత్వం మినహాయింపు ఇచ్చిన వ్యవసాయ కార్యకలాపాలు కనీస మద్దతు ధరతో సహా వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ వంటివి అనుబంధ శాఖలతో కలిసి రూపొందించడం ఉపయోగ కరంగా ఉంటుంది.

# బాధితులకు ఆసరా సీఎం రిలీఫ్ ఫండ్

### ఎమ్మెల్యే పంతం నానాజీ

**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ గోదారిగుంటలో గల క్యాంపు కార్యాలయం వద్ద వలసపాకల గ్రామ నివాసి తడాల ఆదిత్య నాగమల్లిక్ అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకుంటూ ఆర్థిక ఇబ్బందులతో సీఎంఆర్ఎఫ్‌కి అప్లై చేయగా శాంక్షన్ అయిన 6 లక్షల (6,00,000/-)రూపాయల సీఎంఆర్ఎఫ్



చెక్కును పంపిణీ చేసిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న కూడా పేదవాళ్లకి మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశ్యం తో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, అర్హత ఉన్న వారికీ 15 రోజుల్లో నిధులు విడుదల చేస్తు బాధితులకు భరోసా కల్పిస్తున్నారని వారికీ కాకినాడ రూరల్ ప్రజానీకం తరపున ప్రత్యేక ధన్యవాదములు తెలియచేస్తున్నామని, ఇంకా కొన్ని అప్లికేషన్స్ పరిశీలనలో ఉన్నాయని అవి కూడా త్వరలోనే అందిస్తామని తెలిపారు..ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, జన సైనికులు, తదితరులు పాల్గొన్నారు.

### సానా ఫౌండేషన్ ద్వారా సర్పవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు

# కంప్యూటర్ అందజేత



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కంప్యూటర్ విద్యాభ్యాసాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలకు కంప్యూటర్‌ను బహూకరించారు. బుధవారం సాయంత్రం పాఠశాల ప్రాంగణంలో హెచ్ఎం పి.ఆర్.పి. కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధానం గా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కార్యాలయం ఇంచార్జ్ మేకా లక్ష్మణమూర్తి పాల్గొనగా, ప్రత్యేక అతిధిగా ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ , ఫౌండేషన్ సభ్యులు ముమ్మిడి వెంకటేశ్వరరావు విచ్చేశారు. ముఖ్య అతిథులు మేకా లక్ష్మణమూర్తి కంప్యూటర్‌ను హెచ్ఎంకు అందజేశారు. అలాగే విద్యార్థులకు నోటు పుస్తకాలను అతిథులు అందజేశారు. ఈ సందర్భంగా మేకా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు నిబద్ధతతో చదువుకొని తమ భవిష్యత్తును మెరుగుపరుచుకుని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. సానా సతీష్ బాబు ఫౌండేషన్ విద్య, ఆరోగ్యం, సామాజిక సేవా రంగాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతోందని గుర్తుచేశారు. ఈ విధమైన సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆయన సూచించారు. ఫౌండేషన్‌చైర్మన్ తలాటం హరీష్ మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడా పరంగా ఏ సహాయ సహకారాలు కావాలన్నా సహకరిస్తామన్నారు. పాఠశాల విద్యార్థులు ఆర్ఎంసి గ్రౌండ్‌లో హాకీ నేర్చుకోవాలని సూచించారు. క్రీడాకారుల అభ్యున్నతి కోసం తనప్రోత్సాహం ఉంటుందన్నారు. పాఠశాల ప్రాంగణంలో క్రీడా వస్తువులు భద్రపరచుకునేందుకు ఓ గదిని ఫౌండేషన్ తరపున నిర్మిస్తామన్నారు. అనంతరం ఉపాధ్యాయులు మేకా లక్ష్మణమూర్తికి, తలాటం హరీషలను సత్కంరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పి.ఆర్.పి. కుమార్, మాజీ విద్యాకమిటీ కోఆప్టెడ్ సభ్యులు ఎల్.ఎస్.వీర భద్రరాజు, ఉపాధ్యాయులు ఎం.ఎస్. వీరభద్రరావు, డి.సత్యానందం, జి.సూర్యరావు తదితరులు పాల్గొన్నారు.

# గొడ్డటిపాలెం గ్రామంలో రైతన్న మీకోసం - రైతన్న సేవ కార్యక్రమం

**కాకినాడ రూరల్ (కరప), విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ ఆదేశాల మేరకు రైతన్న మీకోసం రైతన్న సేవలో అరట్లకట్ట గొడ్డటి పాలెం గ్రామంలో కరప మండలం వ్యవసాయ అధికారి సత్యా, సురేష్,కరప మండలం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ముద్రగడ రమేష్ కరప మండలం జనసేన పార్టీ అధ్యక్షులు బండారు మురళి, కరప మండలం సీనియర్ నాయకులు భోగి రెడ్డి కొండబాబు,రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ భోగి రెడ్డి గంగాధర్,



కూటమి నాయకులు అరట్లకట్ట జనసేన పార్టీ గ్రామ కమిటీ ప్రెసిడెంట్ బత్తుల సతీష్,టిడిపి నాయకులు సొసైటీ ప్రెసిడెంట్ గంట వీరబాబు,కూటమి నాయకులు గొడ్డటి పాలెం జనసేన పార్టీ గ్రామ కమిటీ ప్రెసిడెంట్ వీరం రెడ్డి ముత్యాలరావు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు చోడా బత్తుల శ్రీనివాస్,గోన ఆంజనేయులు, గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్ వాసంశెట్టి సురేష్, నీటి సంఘం డైరెక్టర్ కడియాల సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్ గంజ రాంబాబు, వాసంశెట్టి సూర్యనారాయణ, శీలం గోపాలకృష్ణ, దాసరి ఏకరవి కుమార్,గ్రామ కూటమి నాయకులు కలిసి ఇది మన మంచి ప్రభుత్వం రైతులకు ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడం జరిగింది.

# తడిసిన ధాన్యపు రాశులను పరిశీలించిన జనసేన నాయకులు



**కరప, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాల మేరకు, గత మూడు రోజులుగా ద్విత్వ తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాల వల్ల ఇబ్బంది పడుతున్న కరప మండలం కోరిపల్లి, కరప, జెడ్ బావారం, పెనుగుదురు గ్రామాలకు చెందిన రైతుల ధాన్యం రాశుల వద్దకు వెళ్ళి రైతుల సమస్యలను అడిగి తెలుసుకుని వారికి కావలసిన తర్పాలిన్ మరియు ఇతర సామాగ్రిని అందించడానికి ముందుంటామని మీకు ఏది కావాలన్నా కూటమి నాయకులను కలవాలని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ముద్రగడ్డ రమేష్,ఆత్మ చైర్మన్ గొల్లపల్లి చంద్ర శేఖర్ కరప మండల జనసేన పార్టీ అధ్యక్షులు బండారు మురళీ, ఎమ్ఏఓ సత్య, ఏఈఓ శ్రీరామ్, పెనుగుదురు సొసైటీ డైరెక్టర్ సింగంపల్లి నాగేశ్వర్ రావు నడకుదురుజనసేన గ్రామఅధ్యక్షులు బిరుద భాస్కర్ తమ్మయ్య, కరప జనసేన గ్రామ అధ్యక్షులు పేకేటి దుర్గా ప్రసాద్, రైతులు, గ్రామ ప్రజలు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# తుని బాలిక వీడియోల ప్రచారకర్తల అరెస్టులు మొదలు...!

**తుని, విశ్వం వాయిస్ న్యూస్ :** తునిలో బాలికపై వృద్ధుడి అత్యాచార యత్నానికి సంబంధించిన వీడియోను ఎటువంటి గోప్యతా జాగ్రత్తలు తీసుకోకుండా సోషల్ మీడియాలో అప్లోడ్ చేసిన కొంత మందిపై కేసులు నమోదు అవుతున్నాయని తుని రూరల్ సీఐ. చెన్నకేశవరావు తెలిపారు. వారు అందరినీ సాయంత్రంలోపు అదుపులోకి తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే తమ బృందాలు సోషల్ మీడియా ఎకౌంట్లను తనిఖీ చేస్తున్నాయని, ఎవరైనా అసభ్యంగా వీడియోలు పెట్టినా, నిందితుడి కుటుంబ సభ్యుల గౌరవానికి భంగం కలిగించేలా పోస్టులు పెట్టినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు తాము సంసిద్ధం అయ్యాము అన్నారు. తుని పట్టణంలోని సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో బుధవారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడారు. తొలుత బాలికతో పాటు నిందితుడు నారాయణరావు ఉన్న వీడియోను ఒకరు చిత్రీకరించారని, వారు మంచి ఉద్దేశంతో చిత్రీకరించినా అది వేరొకరికి ఫార్వర్డ్ అయిందని తెలిపారు. హంసవరం కేంద్రంగా ఈ వీడియోలన్నీ వివిధ సామాజిక మాధ్యమాల గ్రూపుల్లో అప్లోడ్ అయినట్లు నిర్ధారించుకున్నా మన్నారు. దీనికి బాధ్యులైన కొందరిని ఇప్పటికే గుర్తించామని, వారిలో మహిళా నాయకులు కూడా ఉన్నారు అన్నారు. కొంత మందిని అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు. తుని పట్టణంలో కూడా కొంత మందిని గుర్తించామని చెప్పారు. ఇలాంటి వీడియోలు ఎవరైనా సోషల్ మీడియాలో అప్లోడ్ చేసి ఉంటే వాటిని తక్షణమే తొలగించాలని చేయాలని సీఐ కోరారు. తమ గౌరవానికి భంగం కలిగేలా సోషల్ మీడియాలో ట్రోల్స్ చేస్తున్నారని, దీనివల్ల తాము తీవ్ర మనస్థాపానికి గురవుతున్నామని నిందితుడు నారాయణరావు కుటుంబ సభ్యులు తమకు ఫిర్యాదు చేశారని సీఐ చెప్పారు. ఇకపై ఎవరైనా అటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



# డిసెంబర్ 5న మెగా పేరెంట్

## టీచర్ మీటింగ్‌కు ఘనంగా ఏర్పాట్లు - మంత్రి కందుల దుర్గేష్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లాలో డిసెంబర్ 5న విద్యాశాఖ ఆధ్వర్యంలో 956 పాఠశాలల్లో (ప్రైమరీ-711, అప్పర్ ప్రైమరీ స్కూల్ -59,హై స్కూల్-186) "మెగా పేరెంట్-టీచర్ మీటింగ్" నిర్వహిస్తున్నట్లు, అందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జిల్లా పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవడం జరుగుతోందని జిల్లా మంత్రి, రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తో కలిసి విలేఖరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం కార్యక్రమంలో జిల్లా మొత్తం 93,399 మంది విద్యార్థులు, 2,00,000 మందికి పైగా తల్లిదండ్రులు, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు మరియు పూర్వ విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు. "డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం" ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంలో తల్లిదండ్రులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ సభ్యులను ఒక వేదికపైకి తీసుకువచ్చి, పాఠశాల- సమాజ అనుసంధానాన్ని మరింత బలపరిచేలా కార్యక్రమాలు రూపొందించడం జరుగుతోందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాలను రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో విశాఖపట్నంలో మెగా పేరెంట్-టీచర్స్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అదే సమయంలో తూర్పు గోదావరి జిల్లాలో కూడా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, విద్యార్థుల వ్యక్తిగత వికాసం, తల్లిదండ్రుల భాగస్వామ్యం పెంపు లక్ష్యంగా ఉందని మంత్రి చెప్పారు. తూర్పుగోదావరిలో డిసెంబర్ 5న జరగబోయే మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ ను ప్రతి పాఠశాలకు చెందిన తల్లిదండ్రులు, విద్యార్థులు విజయవంతం చేయాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపు ఇచ్చారు. కార్పొరేట్ స్కూల్‌లకు పరిమితమైన పేరెంట్-టీచర్ సమావేశాన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ అందుబాటులో ఉంచడం, విద్యార్థుల వ్యక్తిగత వికాసం, పాఠశాలల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం పెంపు వంటి లక్ష్యాలను సాధించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని మంత్రి వివరించారు. ప్రస్తుతం జిల్లాలో దాదాపు 93,300 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నట్లు మంత్రి తెలిపారు. పాఠశాలల మౌలిక సదుపాయాలు, బోధన నాణ్యతపై తల్లిదండ్రులు తమ అభిప్రాయాలు, సూచనలు ప్రభుత్వానికి తెలియ జేయడానికి ఈ కార్యక్రమం ఉత్తమ వేదికగా ఉపయోగ పడుతుందనీ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ ద్వారా విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, పాఠశాలల విద్యా ప్రమాణాల పెంపు, తల్లిదండ్రుల భాగస్వామ్యం మరింత విస్తరించడం సాధ్యమని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న హెూలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు, ప్రాజెక్టుల ప్రదర్శనలు, ప్రత్యేక ఆహార కార్యక్రమాలు విద్యార్థుల అభ్యసనాన్ని బలపరిస్తాయని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి పాఠశాల ఈ కార్యక్రమాన్ని అత్యంత సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులు, ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెూలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ, తరగతి ఉపాధ్యాయులతో వ్యక్తిగత అంచనా చర్చలు, విద్యార్థుల క్రీడా కిట్లు, జాదూ పిటారా కిట్లు, సైన్స్ ప్రాజెక్టులు, ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవం తం చేయడానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఎస్ ఎంసి సభ్యులు మరియు పూర్వ విద్యార్థులు ప్రతిభావంతమైన పాల్గొనవలసిందిగా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ వై.మేఘాస్వరూప్, ఎమ్మెల్సీ రాజశేఖర్, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### దోసకాయలపల్లిలో హత్య కేసు నిందితుడు

# రాజ్ కుమార్ అరెస్టు

## సర్కిల్ ఇన్స్పెక్టర్ వై సత్య కిషోర్ - నిందితుడికి 14 రోజులు రిమాండ్




**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని దోసకాయలపల్లి గ్రామంలో నవంబర్ 30న పిల్లి ఆనంద్ హత్యకు గురైన విషయం పాఠకులకు విధేయతమే. రాజమహేంద్రవరం ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు ఉత్తరమండల డిఎస్పి శ్రీకాంత్ పర్యవేక్షణలో మంగళవారం బొబ్బిలంక గ్రామంలో నిందితుడు గాడి రాజ్ కుమార్ ను అరెస్టు చేసినట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్య కిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుడు పిల్లి ఆనంద్ కు , రాజ్ కుమార్ వరసకు బావమరిది అని, మృతుడు తన భార్య విషయంలో తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ, తనకి చేతబడి చేయిస్తున్నాడని అందువలనే అతనిని హతమార్చినట్లు నిందితుడు తెలిపాడన్నారు. బుధవారం ఉదయం కోర్టుకు హాజరుపరచగా, కోర్టు ముద్దాయికి 14 రోజుల రిమాండ్ విధించిందన్నారు. అయితే మృతుని తల్లి, రక్తబంధువులు మృతుని హత్యవెనుక మృతుని భార్య త్రివేణి ప్రమేయం కూడా ఉన్నదన అనుమానం వ్యక్తం చేయడంతో ఆ వైపుగా కూడా దర్యాప్తు కొనసాగిస్తున్నామన్నారు. హత్య కేసును వెంటనే చేదించడానికి ఎస్ఐ నాగర్జున, సిబ్బందిని సర్కిల్ ఇన్స్పెక్టర్ అభినందించారు.

# 7న నిడదవోలు శ్రీకోట సత్తెమ్మతల్లికి బోనాల సమర్పణ..

## చీర, సారెతో నిడదవోలు వెళ్తాం - న్యాయవాది ఆదిలక్ష్మి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డిసెంబర్ 7వ తేదీన ఆదివారం ఉదయం నిడదవోలు శ్రీకోట సత్తెమ్మ తల్లికి భోనాలు సమర్పించ నున్నట్లు న్యాయవాది జి.ఆదిలక్ష్మి చెప్పారు. గడిచిన రెండేళ్లుగా మార్గశిర మాసంలో ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. స్థానిక ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో బుధవారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మార్గశిర పౌర్ణమి నుండి చవితి వరకు అతి వైభవంగా శ్రీ కోటసత్తెమ్మ తల్లికి తిరుణాళ్ళ మహెూత్సవం చేస్తారని చెప్పారు.స్థానిక శ్రీనగర్ లోని తన నివాసం నుంచి దాదాపు 800మంది మహిళలతో బోనాల సమర్పణకు వెళ్తామని ఆదిలక్ష్మి చెప్పారు. ఆ జగన్మాత శ్రీ కోట సత్తెమ్మ తల్లికి సామూహికంగా చీర, సారె, కళశము,బోనముల తో సంప్రదాయ పద్ధతిలో పసుపు కుంకుమలను సమర్పించనున్నట్లు ఆమె వివరించారు. సనాతన ధర్మంలో శక్తి స్వరూపిణి స్త్రీ రూపమని ఆమె తెలిపారు. పసుపు, ఎరుపు రంగు చీరలు ధరించి సాంప్రదాయ బద్ధంగా పాల్గొనాలని, వాళ్ళు రాకూడదు, వీళ్ళు రాకూడదు అనే నియమం ఏదీ లేదని, మహిళలంతా ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని ఆదిలక్ష్మి చెప్పారు. ఎలాంటి రుసుములు, విరాళాలు, చందాలు వసూలు చేయడం లేదని ఆమె స్పష్టం చేసారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితర ప్రజా ప్రతినిధులను ఆహ్వానించినట్లు ఆమె వివరించారు. మద్దిపాటి రజని, వీరభద్రరావు మాట్లాడుతూ బోనాల సమర్పణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

### ప్రాంతీయ ఉన్మాదులను - ఖాసీం రజ్వి వారసులను బహిష్కరిద్దాం..

# అభివృద్ధిని సాధిద్దాం.. : మేడా శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కేసీఆర్ నాటిన విషపు వృక్షాలు తెలంగాణా ఆస్తిత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి.ఆంధ్రప్రదేశ్ లో కోనసీమ వేదికగా పవన్ కళ్యాణ్ చేసిన తప్పుడు వ్యాఖ్యాల కు ఆంధ్రుల తరుపున భహిరంగ క్షమాపణ కోరుతున్నాము. రవీంద్ర భారతి ప్రాగణంలో సినీ నటుడు శుభలేఖ సుధాకర్ ను ఒక మీడియా ప్రతినిధిని అంటు మా తెలంగాణాలో ఏమి చేయాలో , మాట్లాడాలో మీ దగ్గర తెలుసుకోవాలా ! అంటు బాధ్యతను మరిచి మాట్లాడిన అతన్ని తెలంగాణా వాదులు మందలించాలి. ఇప్పటికే కేసీఆర్ ను ఆదర్శంగా చేసుకుని కొంతమంది ప్రాంతీయ ఉన్మాదాన్ని ప్రోత్సహిస్తున్న ఘటనలు బావితరాలను మంచి పరిణామాలు కావు అని తెలంగాణా మేధావులు గ్రహించాలి. కొంతమంది బ్రతకటం కోసం ప్రాంతీయ ఉన్మాద చర్యలను ఉపాధిగా మార్చుకుంటున్నారు. ఇప్పటికే కొంత రాజకీయ ఐఖ్యత లోపించిన కారణంగా మోదీ సర్కార్ రాజకీయ అవసరాలకు తెలుగు రాష్ట్రాలపై కాలకుట విషం కక్కుతుంది. ఇప్పటికే ఖాసీం రజ్వి వారసులు రాజకీయ పార్టి ముసుగులో హైదరాబాద్ కేంద్రంగా తిష్ట వేసుకుని ఒక ప్రక్క పాకిస్తాన్ తీవ్రవాదాన్ని ప్రోత్సహస్తు మోదీ సర్కార్ కు బాంచన్ గా బ్రతుకుతున్నారు . తాలిబాన్ వారసులను మరిపిస్తున్నారు. తెలంగాణా - ఆంధ్రప్రదేశ్ మేధావులు, విద్యార్థులు, యువత తెలుగు రాష్ట్రాల ఐఖ్యతకు ఒక బలమైన కార్యాచరణకు సిద్దపడాలి. లేకుంటే రెండు తెలుగు రాష్ట్రాలు నష్ట పోవటం ఖాయం అని గుర్తించాలి. పవన్ కళ్యాణ్ తప్పుడు మాటల పైన, రవీంద్ర భారతి ప్రాగణంలో మీడియా ప్రతినిధి ఉన్మాద మాటలపైన రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు చిత్త శుద్ధి ఉండాలి. లేకుంటే మరో ప్రమాధాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందేమో నని తెలుగు ప్రజలు భయపడుతున్నారు. తెలంగాణా- ఆంధ్రప్రదేశ్ పౌరులు ఉమ్మడి కార్యాచారణ ద్వారా భవిష్యత్ అవసరాలకు మార్గం చేసుకోక పోతే అభివృద్ధితో పాటుగా శాంతి భద్రతల సమస్యలతో నష్ట పోయే ప్రమాదం వుందని బావించాలి. రెండు తెలుగు రాష్ట్రాల మేధావులు,యువత, అభివృద్ధిపై దృష్టి సారించాలి. కేసీఆర్ ,పవన్ కళ్యాణ్ వారసులను భహిష్కరించాలి.రెండు తెలుగు రాష్ట్రాలు కలిసి ఉంటే కేంద్రంలో బలంగా ఉంటామని గ్రహించాలి. రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ,ఐఖ్యతకు ముందుగా ఉస్మానియా - ఆంధ్ర యూనివర్సిటీల విద్యార్థులు నడుం బిగించాలి.ఆ ప్రయత్నానికి మేము సైతం అని తెలియచేసుకుంటు న్నాము.

### సూపర్ సిక్స్ పథకాల అమలులో

# ఎన్డీఏ ప్రభుత్వం వైఫల్యం : జక్కంపూడి

## ప్రజా సమస్యలపై పోరాటానికి సంయుక్తం కండి.. - కేసులు మాఫీ కోసం బాబు తహతహ



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల్లో వచ్చిన హామీలను తుంగలోకి తొక్కి సూపర్ సిక్స్ పథకాల పేరిట ప్రజలను మభ్యపెడుతుం దని వైయస్సార్సీపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా ఎన్డీఏ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కోటి గ్రామంలో సర్పంచ్ వెంటపాటి దుర్గారావు ఆధ్వర్యంలో "నా కార్యకర్తలు- నా కుటుంబం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను, భవిష్యత్తులో రాజకీయ పరిణామాల పై కార్యకర్తలతో రాజా దీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి పార్టీ కంటే ప్రజా శ్రేయస్సు ముఖ్యమన్న ఉద్దేశంతో కొన్ని కుటుంబాలకు ఒక వాలంటీర్ ఎంపిక చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకు, కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్ కే దక్కుతుందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికలు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను పసుపు చొక్కాల వారికి మాత్రమే అందజేసి, ఎందరో అర్హులను ప్రక్కన పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు అధికారులను బెదిరించి, కోట్లకు వెళ్లకుండా, కేసులు మాఫీ కోసం వెంపర్లాడుతున్నారన్నారు. గ్రామాల్లో వైసిపి నాయకులను, కార్యకర్తలను ఏకతాటిపైకి తీసుకువచ్చి ప్రజలతో మమేకమే ప్రజా సమస్యలపై పోరాడడానికి వైకాపా శ్రేణులను సంసిద్ధం చేస్తున్నామన్నారు. త్వరలో గ్రామాల్లో కమిటీలు వేసి, పార్టీకి పూర్వ వైభవం తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కర్రి నాగేశ్వరరావు, వైఎస్ఆర్సిపి నాయకులు నక్కా రాంబాబు, కొండపల్లి దుర్గారావు, అడపా కనకరాజు, అడపా కుమార్,ఎంపీటీసీ గట్టి ప్రసాద్, పలువురు వైకాపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### మానవాళికి ఆక్సిజన్ అందించే

# మొక్కలను కాపాడుకోవాలి

## మొక్కలు నాటిన రాజమహేంద్రి మహిళా కళాశాల వాలంటీర్లు




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** బుధవారం ఉదయం రాజమహేంద్రి మహిళా డిగ్రీ మరియు పీ.జీ.కళాశాల ఆధ్వర్యంలో రత్నంపేటలో జరుగుతున్న జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం చివరి రోజైన ఏడవ రోజులో భాగంగా కళాశాల సెక్రటరీ టి.కే విశ్వేశ్వర్ రెడ్డి మరియు కళాశాల ప్రిన్సిపల్ ఎం.కే.ఎస్ ప్రసాదులు ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లతో కలిసి మొక్కలు నాటారు. ముందుగా కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ డాక్టర్ టి.కే విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ మానవ జీవితంలో ఆక్సిజన్ ఎంత ముఖ్యమైనదో మనందరికీ తెలుసు అని అటువంటి ఆక్సిజన్ ని మనకు అందించే మొక్కలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి మీద ఉందని, కావున ప్రతి విద్యార్థి తమతమ ఇండ్ల దగ్గర ఒక మొక్క నాటి జాగ్రత్తగా పెంచాలని విద్యార్థులకు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం.కే.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ మొక్కలు సూర్యరశ్మి నుండి కార్బన్డయాక్సైడ్ ను గ్రహించి మనకు ఆక్సిజన్ విడుదల చేస్తాయని నేటి కాలంలో రహదారుల విస్తరణ వలన రోడ్లపై ఉన్న చెట్లను నరికి వేస్తున్నారని, ఇలాగ జరిగితే మనకు ఆక్సిజన్ అందక చాలా నష్టాలు జరిగే అవకాశం ఉందని అందువల్ల ప్రతి విద్యార్థి మొక్కలను పెంచాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ ఎన్.ఎస్.ఎస్. శిబిరం చివరి రోజులో భాగంగా ఈ శిబిరానికి ఎంతగానో సేవలు అందించిన కళాశాల మాజీ ఎన్.ఎస్.ఎస్. పి.వో జి. లక్ష్మీ ప్రవీణకు సన్మానం చేసి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్.ఎస్.ఎస్. పి.ఓ దంటు వీర వెంకట్రావు, మాజీ పీ.వో. లక్ష్మీ ప్రవీణ, ఎన్.ఎస్.ఎస్. క్లర్క్ మౌనిక, శాంతి, సురేష్, కళాశాల ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గొన్నారు.



# అఖిల భారత పీఎంపీ, ఆర్ఎంపీల సమావేశం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** న్యూఢిల్లీలోని ఆంధ్ర భవన్ మీటింగ్ హాల్‌లో అఖిల భారత పీఎంపీ, ఆర్ఎంపీ అసోసియేషన్ల సంయుక్త కార్యాచరణ కమిటీ ఏర్పాటు సమావేశం జరిగింది. డాక్టర్ గోవింద రెడ్డి అధ్యక్షతన డాక్టర్ ఎన్ఎల్ రావు,ది పిఎంపి అసోసియన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ముఖేష్ అగర్వాల్,ఏపీఆర్ జేఏసీ లీగల్ ఎడ్వైజర్ డాక్టర్ ఎన్ ఎల్ రావు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. టీ.డీ జనార్ధన్ ఫోన్ ద్వారా ఆశీస్సులు మరియు సలహాలు ఇచ్చారు.ది పీఎంపీ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు సమావేశానికి స్వాగతం పలికారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, ఢిల్లీ, కర్ణాటక, పంజాబ్, చత్తీస్‌ఘర్, హర్యాన మొదలైన 15 రాష్ట్రాలు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. గౌరవ అధ్యక్షుడిగా టీడీ జనార్ధన్‌ను, డాక్టర్ గోవింద రెడ్డి చైర్మన్‌గా డాక్టర్ ఎన్ఎల్ రావు గౌరవ న్యాయ సలహాదారుగా మరియు ముఖేష్ అగర్వాల్ జైపూర్‌ను మొదటి వైస్ చైర్మన్ గా, అన్ను తివారీ బీహార్ రెండవ వైస్ చైర్మన్‌గా, సీఎస్ రావు గుజరాత్‌ను మూడవ వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తదుపరి సమావేశంలో అన్ని రాష్ట్ర సంఘాల నుండి కన్వీనర్లను ప్రకటిస్తారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ అసోసియేషన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ పేరును ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానించ డమైనది అని ఒక ప్రకటనలో విడుదల చేశారు.

### స్క్రబ్ టైఫస్ వ్యాధిపై

# ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

## డి.ఎం.హెచ్.వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తగిన చికిత్స అందుబాటులో ఉండడంతో పాటు ప్రజలు నిర్భయంగా ఉండవలసిందిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.కె.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని కొద్ది జిల్లాల్లో "స్క్రబ్ టైఫస్" కేసులు నమోదవుతున్నప్పటికీ, ఈ వ్యాధి సుత్సుగాముషి అనే కీటకం కుడితేనే సోకుతుందని తెలిపారు. ఈ కీటకం కుడిన ప్రదేశంలో ఎర్రటి మచ్చ కనిపించడం, ముఖ్యంగా పొలాలు, తోటలు, గుబురు చెట్లు ఉన్న ప్రదేశాలకు వెళ్లే వారికి ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. పొడవైన చేతులు గల షర్టులు, ప్యాంట్లు వేసుకోవడం, శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు ధరించడం ద్వారా కీటకం కుడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చని సూచించారు. జ్వరం లేదా అనుమానాస్పద లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం లేదా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలని పౌరులను విజ్ఞప్తి చేశారు.

# మాజీ సీఎం జగన్‌ను కలిసిన సుజన్ కుమార్



**అత్తిలి, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ విభిన్న ప్రతిభావంతులు దినాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశామని వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు బుడితి సుజన్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దివ్యాంగుల ఫించన్ తొలగించి, వెరిఫికేషన్ నెపంతో వేదింపులకు గురి చేస్తున్న విధానాన్ని, జిల్లాలో దివ్యాంగుల సమస్యలు గురించి వైయస్ జగన్మోహన్ రెడ్డికి వివరించినట్లు తెలియ జేశారు.అలాగే సదరం స్లాట్ బుకింగ్ ఆఫ్లైన్ విధానంలో కూడా అమలు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని వైయస్ జగన్మోహన్ రెడ్డిని కోరారు.

# అనంత రామలక్ష్మికి ఘనంగా నివాళులర్పించిన బత్తుల



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం రోటరీ క్లబ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పట్టపగలు వెంకట్రావు సతీమణి పట్టపగలు అనంత రామలక్ష్మి ఇటీవల స్వర్గస్తులైనారు. బుధవారం రాజమహేంద్రవరం జయంతి రోడ్డులో గల జెకె ఫంక్షన్ హాల్ నందు అనంత రామలక్ష్మి పెద్దకర్మ సందర్భంగా బత్తుల బలరామకృష్ణ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడా వాయిస్

# మళ్లీ టాస్ ఓడిన భారత్..

## మూడు మార్పులు చేసిన సౌతాఫ్రికా..



రెండో వన్డేకు రాయ్‌పూర్ సిద్ధమైంది. భారత్, సౌతాఫ్రికా జట్ల మధ్య మరికాసేపట్లో రెండో వన్డే ఆరంభం కానుంది. తొలి వన్డేలో గెలిచిన భారత్ సిరీస్‌లో ఆధిక్యంలో నిలిచింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా గెలిస్తే భారత్ సిరీస్ సొంతం చేసుకుంటుంది. ఈ క్రమంలో టాస్ నెగ్గిన సౌతాఫ్రికా ఫీల్డింగ్ ఎంచుకుంది. ఇక భారత్ విషయానికి వస్తే ఎటువంటి మార్పులు చేయలేదు. భారత్ వన్డేల్లో వరుసగా 20వసారి టాస్ ఓడింది. సౌతాఫ్రికా విషయానికి వస్తే.. తెంబా బవుమా, లుంగి ఎంగిడి, కేశవ్ మహరాజ్‌లు తుది జట్టులోకి వచ్చారు.

**మార్పులు లేకుండానే భారత్**

తొలి వన్డేలో నెగ్గిన భారత్.. ఈ మ్యాచ్ కోసం ఎటువంటి మార్పులు చేయలేదు. దాంతో రుతురాజ్ గైక్వాడ్‌కు మరో అవకాశం లభించింది. ఇక రిషభ్ పంత్, తిలక్ వర్మలకు నిరాశే ఎదురైంది. రుతురాజ్ గైక్వాడ్‌పై ఒత్తిడి ఉంది. యశస్వి జైస్వాల్ భారీ ఇన్నింగ్స్ ఆడాల్సి ఉంది. ఇక గత మూడు మ్యాచ్‌ల్లోనూ రోహిత్ శర్మ 50 అంతకంటే ఎక్కువ పరుగులు చేశాడు. ఇక విరాట్ కోహ్లీ గత రెండు మ్యాచ్‌ల్లోనూ ఆ పని చేశాడు. కేఎల్ రాహుల్ నంబర్ 6లో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. వీరికి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్‌లు కూడా తోడైతే భారత్ మరోసారి భారీ స్కోరు చేసే ఛాన్స్ ఉంది. ఇక సౌతాఫ్రికా విషయానికి వస్తే ఏకంగా మూడు మార్పులు చేసింది. తొలి వన్డేలో విఫలం అయిన రియాన్ రికల్టన్‌ను పక్కన పెట్టింది. అలాగే బార్ట్‌మన్, సుబ్రాయెన్‌లను కూడా పక్కన పెట్టింది. వీరి స్థానాల్లో తెంబా బవుమాతో పాటు లుంగీ ఎంగిడి, కేశవ్ మహరాజ్‌లు తుది జట్టులోకి వచ్చారు. సౌతాఫ్రికాకు ఈ మ్యాచ్ డూ ఆర్ డై లాంటిది. గెలిస్తేనే సిరీస్ ఆశలు ఉంటాయి. ఓడితే మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ చేజారుతుంది. ఈ స్టేడియంలో ఇప్పటి వరకు ఒకే ఒక్క వన్డే మ్యాచ్ జరిగింది. అందులో తొలుత బ్యాటింగ్ చేసిన జట్టు 118 పరుగులకే ఆలౌటైంది. కాబట్టి పిచ్ ఎలా ఉంటుందో చెప్పలేం. కండీషన్స్‌ను బట్టి చూస్తే పేసర్లకు అనుకూలంగా ఉండే అవకాశం ఉంది. ఇక భారత్ వన్డేల్లో వరుసగా 20వ మ్యాచ్‌లో టాస్ ఓడింది. కెప్టెన్లు మారుతున్నా భారత్ మాత్రం టాస్ గెలవడం లేదు.

**తుది జట్లు**

టీమిండియా : కేఎల్ రాహుల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ కృష్ణ

# సంచలన నిర్ణయం తీసుకున్న రో-కో.. అందుకు గ్రీన్ సిగ్నల్!



కాంపిటీటివ్ క్రికెట్ నుంచి ఎక్కువ కాలం దూరంగా ఉంటే మ్యాచ్ ఫిట్‌నెస్ ఏమవుతుందోనని ఆందోళన చెందుతోంది. అందుకే రోహిత్, కోహ్లీ డొమెస్టిక్ క్రికెట్ ఆడాలని కోరుతోంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ 2027 వరల్డ్ కప్ ప్లాన్స్ ఎంత సీరియస్‌గా ఉన్నాయో ఇప్పటికే ప్రూవ్ అయింది. టీ20, టెస్ట్ నుంచి రిటైర్ అయ్యారు, ఆడటానికి వన్డేలు పెద్దగా లేవు, 2027 వరకు ఫామ్‌లో ఉండటం కష్టమనే విశ్లేషణలు చాలానే వినిపించాయి. కానీ ఈ లెజెండరీ ప్లేయర్స్ తమలో ఇంకా రన్స్ స్కోర్ చేయాలనే హంగర్ తగ్గలేదని ఆస్ట్రేలియా సిరీస్‌లో నిరూపించారు. ఇప్పుడు దక్షిణాఫ్రికా సిరీస్‌లోనూ ముందుండి నడిపిస్తున్నారు. కానీ బిసిసిఐ వారు ఇంకా షార్ప్‌గా ఉండాలని కోరుకుంటోంది. కాంపిటీటివ్ క్రికెట్ నుంచి ఎక్కువ కాలం దూరంగా ఉంటే మ్యాచ్ ఫిట్‌నెస్ ఏమవుతుందోనని ఆందోళన చెందుతోంది. అందుకే రోహిత్, కోహ్లీ డొమెస్టిక్ క్రికెట్ ఆడాలని కోరుతోంది. రోహిత్, కోహ్లీ ఆస్ట్రేలియాలో రిథమ్ కనుగొనడానికి కొంత టైమ్ తీసుకున్నారు. అయితే వన్డే సిరీస్ కంప్లీట్ అయ్యే సరికి సాలిడ్ ఫామ్‌లోకి వచ్చేశారు. ఇప్పుడు దక్షిణాఫ్రికాతో రాంచీలో జరిగిన మొదటి వన్డేలో అదే ఫామ్ కంటిన్యూ చేశారు. రోహిత్ హాఫ్ సెంచరీ, కోహ్లీ సెంచరీతో చెలరేగారు. అయినప్పటికీ 2027 ఒడిఐ ప్రపంచ కప్ విషయానికి వస్తే బిసిసిఐ పెద్దగా ముందుకు ఆలోచించడం లేదు. అప్పటికి ఇద్దరు ఆటగాళ్లు 40 ఏళ్లకు దగ్గరగా ఉంటారు. అలాంటప్పుడు వారి చుట్టూ లాంగ్ టర్మ్ ప్లాన్స్ రూపొందించడం గురించి బోర్డుకు స్పష్టత లేదు. అందుకే బిసిసిఐ సీనియర్ ఆటగాళ్లను డొమెస్టిక్ క్రికెట్ ఆడాలని సూచిస్తోంది. ఈ సంవత్సరం ప్రారంభంలో సెంట్రల్లీ కాంట్రాక్టెడ్ ప్లేయర్స్ డొమెస్టిక్ ఈవెంట్స్‌లో ఆడటాన్ని బోర్డు తప్పనిసరి చేసింది. ఆ సమయంలో రోహిత్ రంజీ ట్రోఫీలో ముంబై తరఫున, కోహ్లీ ఢిల్లీ తరఫున ఆడారు. రోహిత్ మరిన్ని డొమెస్టిక్ మ్యాచ్‌లు ఆడటానికి సిద్ధంగా ఉన్నాడని కొన్ని నివేదికలు సూచించాయి. అయితే కోహ్లీ అంతగా ఆసక్తి చూపలేదు. రాంచీలో మ్యాచ్ అనంతరం కోహ్లీ మాట్లాడుతూ, నెట్స్‌లో ఎక్కువ గంటలు ప్రాక్టీస్ చేయడం కంటే మెంటల్ ప్రిపరేషన్‌కి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తానని చెప్పాడు. 'నేను ఎప్పుడూ లాట్ ఆఫ్ ప్రిపరేషన్‌ని నమ్మలేదు. నా క్రికెట్ అంతా మెంటల్‌గా రెడీ అవ్వడంపైనే ఉంది. నేను ఫిజికల్లీ చాలా హార్డ్‌గా వర్క్ చేస్తాను, నా ఫిట్‌నెస్ బలంగా ఉన్నంత వరకు, నా బ్యాటింగ్‌ను విజువలైజింగ్ చేసుకుంటే సరిపోతుంది.' అని అన్నాడు. అయినప్పటికీ కోహ్లీ ఇప్పుడు విజయ్ హజారే ట్రోఫీఆడటానికి ఢిల్లీ టీమ్‌లో చేరడానికి అంగీకరించాడు. కోహ్లీ తాను అందుబాటులో ఉన్నానని అసోసియేషన్‌కు చెప్పాడని డిడిసిఎ అధ్యక్షుడు రోహన్ జైట్లీ కన్‌ఫర్మ్ చేశారు. దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ డిసెంబర్ 6న ముగిసిన తర్వాత, డిసెంబర్ 24న ఆలూర్‌లో ఆంధ్రతో జరిగే తొలి మ్యాచ్‌కి కోహ్లీ అందుబాటులో ఉంటాడు. అయితే ఢిల్లీతో చేరే ముందు కోహ్లీ దాదాపు రెండు వారాల సెలవు తీసుకుంటాడు. రోహిత్ మళ్ళీ ముంబై తరఫున డొమెస్టిక్ క్రికెట్ ఆడటానికి సిద్ధంగా ఉన్నాడు. ఇద్దరు సీనియర్ ప్లేయర్స్ డొమెస్టిక్‌లో ఎంత యాక్టివ్‌గా ఉంటారనేది బీసీసీఐ తీసుకునే డెసిషన్స్‌పై ఆధారపడి ఉంటుంది. వారు వన్డేల్లో కొనసాగాలని భావిస్తే, మ్యాచ్‌ఫిట్‌గా ఉండటానికి డొమెస్టిక్ టోర్నీలు హెల్ప్ అవుతాయని బిసిసిఐ నమ్ముతోంది. మరోవైపు ఫ్యాన్స్‌కి కూడా ఇద్దరు బిగ్ స్టార్ క్రికెటర్లను చూసే అవకాశం కలుగుతుంది.

# సోషల్ మీడియా డిస్కషన్.. ఏముంది ఆ సినిమాలో..!



సోషల్ మీడియాలో గత రెండు రోజులుగా ఒక సినిమా గురించి విపరీతమైన డిస్కషన్ జరుగుతుంది. ముఖ్యంగా సినిమాలోని కొన్ని డైలాగ్స్ ని వైరల్ చేస్తున్నారు. ఈ సినిమాపై ఫెమినిస్ట్ ల రియాక్షన్ ఏంటో అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇంతకీ ఈ సినిమాలో అంతగా ఏముందు అంటే మగవారి సంపాదన మీద కుటుంబం ఆధారపడి ఉంటుంది.. ఐతే అదే అమ్మాయి జాబ్ చేస్తుంటే మాత్రం అది ఆమె సెల్ఫ్ ప్రొటెక్షన్ కోసం అంటారు. ఐతే ఈ సినిమాలో ఒక మగాడు సంపాదన ఎందుకు ఖర్చు చేస్తాడు.. ఎలా ఖర్చు చేస్తాడు అన్నది కోర్ట్ రూంలో ఒక లాయర్ తన సొంత అనుభవాల కోణంతో చెబుతాడు.

**రియో రాజ్, మాళవిక మనోజ్ కలిసి..**

ప్రస్తుతం ఈ సీన్ అంతా సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుంది. రియో రాజ్, మాళవిక మనోజ్ కలిసి నటించిన ఆన్ పావం పొల్లతాత్తు సినిమా డిజిటల్ రిలీజ్ తర్వాత మరింత ట్రెండింగ్‌లో ఉంది. సినిమా అక్టోబర్ చివర్లో థియేట్రికల్ రిలీజై పర్వాలేదు అనిపించుకోగా రీసెంట్‌గా జియో హాట్ స్టార్‌లో డిజిటల్ రిలీజైంది. ఈ సినిమా ఓటీటీ రిలీజైన దగ్గర నుంచి అందులోని సీన్స్‌ని తెగ వైరల్ చేస్తున్నారు. ఐతే కొంతమంది ఇది కావాలని మహిళలను కించపరచేలా తీశారు అంటూ కామెంట్ చేస్తున్నారు. కానీ మెజారిటీ పీపుల్ మాత్రం ఇదొక మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్ అని దీన్ని మరోలా చూడాల్సిన అవసరం లేదని అంటున్నారు. ఏది ఏమైనా ఒక సినిమా సోషల్ మీడియాలో ఈ రేంజ్ డిస్కషన్ పాయింట్ అయ్యింది అంటే అది కచ్చితంగా సక్సెస్ అయినట్టే లెక్క. పెళ్లైన మగాడి కష్టాల నేపథ్యంతో.. ఆల్రెడీ రియో రాజ్, మాళవిక మనోజ్ జో సినిమా చేశారు. ఆ సినిమాలోని కొన్ని సీన్స్ ఇప్పటికీ సోషల్ మీడియాలో హడావిడి చేస్తుంటాయి. ముఖ్యంగా రియో రాజ్, మాళవిక జోడీ చూడముచ్చటగా ఉంటుంది. ఇప్పుడు ఆ ఇద్దరు కలిసి చేసిన ఆన్ పావం పొల్లత్తాత్తు సినిమా సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. పెళ్లైన మగాడి కష్టాల నేపథ్యంతో తెరకెక్కిన ఈ సినిమాలో కేవలం మేల్ సైడ్ మాత్రమే సీన్స్ రాసుకున్నారంటూ కొందరు లేడీ ఆడియన్స్ అంటున్నా సినిమా మాత్రం ఒక రేంజ్‌లో ట్రెండింగ్ కొనసాగిస్తుంది. సినిమాలో చూపించినంత మాత్రాన ఇలా ఉంటుందా అని కొన్ని అనిపించినా రియల్ లైఫ్ లో కొన్ని ఇన్సిడెంట్స్ సినిమాలో చూపించే దాని కన్నా ఇంకా ఎక్స్ ట్రీం లెవెల్లో ఉంటాయి. ఐతే రియల్ ఇన్సిడెంట్స్ నేపథ్యంతో తీసే సినిమాలకు ఇలాంటి మిశ్రమ స్పందన రావడం కామనే. ఐతే సినిమా మీద ఒపీనియన్ చెప్పేందుకు కూడా ఓటీటీలో ఆన్ పావం పొల్లత్తాత్తు సినిమా తెగ చూస్తున్నారు నెటిజెన్లు.

సినీ వాయిస్ CINEMA

# పూజాహెగ్డే నెక్ట్స్ ప్లాన్స్ ఏంటి..?



బుట్ట బొమ్మ పూజా హెగ్దే సౌత్ కెరీర్ అంతంత మాత్రంగానే ఉంది. తమిళ్ లో కాస్త పర్వాలేదు కానీ తెలుగులో మాత్రం అమ్మడికి ఛాన్స్ లు లేక కాస్త ఇబ్బంది పడుతుంది. ప్రభాస్ తో రాధే శ్యాం చేసిన ఈ అమ్మడు నెక్స్ట్ మహేష్ గుంటూరు కారం లో ఛాన్స్ వచ్చినట్టే వచ్చి చేజార్చుకుంది. ఆ తర్వాత పూజా హెగ్దేకి తెలుగులో ఒక్క మూవీ కూడా పడలేదు. నాగ చైతన్య, నాని సినిమాల్లో ఛాన్స్ అంటూ వార్తలు రావడమే కానీ అందులో ఏ ఒక్కటి నిజం కాలేదు.

**తెలుగులో ఛాన్స్ లు లేకుండా..**

ఐతే తమిళ్ లో ఆల్రెడీ జన నాయగన్ లో నటిస్తున్న పూజా హెగ్దే నెక్స్ట్ కాంచనా 4లో కూడా ఉందని తెలుస్తుంది. ఇదే కాకుండా మరో సినిమా డిస్కషన్ లో ఉందట. హిందీలో కూడా ఒక ప్రాజెక్ట్ చేస్తుంది పూజా బేబ్. ఎటొచ్చి అమ్మడికి తెలుగులోనే సరైన ఛాన్స్ లు లేకుండా అవుతున్నాయి. పూజా హెగ్దే దుల్కర్ సల్మాన్ కాంబినేషన్ లో ఒక సినిమా వస్తుంది. ఆ సినిమాతో అమ్మడి కొద్దిపాటి గ్యాప్ తర్వాత తెలుగు ఎంట్రీ ఇస్తుంది. బుట్ట బొమ్మని తెలుగు మేకర్స్ ఎందుకు పట్టించుకోవట్లేదు అన్నది తెలియదు కానీ ఆమె ఉంటే సినిమాలో గ్లామర్ షోకి డౌట్ పడాల్సిన అవసరం లేదు. ఇక పూజా బేబీ ఫ్యాన్స్ కి కావాల్సినంత హాట్ స్టఫ్ ఇస్తుంది. కెరీర్ లో ఇప్పటివరకు గ్లామర్ పరంగా తన మార్క్ చూపిస్తూ వచ్చిన పూజా హెగ్దే ఇక మీదట గ్లామర్ ఒక్కటే కాదు తన యాక్టింగ్ టాలెంట్ కూడా చూపించాలని ఫిక్స్ అయ్యింది. అందుకే అమ్మడు ఈమధ్య సినిమాలను కూడా ఆచి తూచి సెలెక్ట్ చేస్తుంది. దుల్కర్ సల్మాన్ తో పూజా హెగ్దే.. దుల్కర్ సల్మాన్ తో సినిమా అంటే మినిమం గ్యారెంటీ ఉన్నట్టే లెక్క. తెలుగు, తమిళ్ భాషల్లో ఈ సినిమా రిలీజ్ ఛాన్స్ ఉందని తెలుస్తుంది. సో అటు కోలీవుడ్ లో పూజా మేనియా కొనసాగించేందుకు కూడా ఈ సినిమా సపోర్ట్ చేస్తుంది. ఇదే కాదు టాలీవుడ్ స్టార్ సినిమాల్లో కూడా పూజా నటించాలని చూస్తుంది. ముఖ్యంగా హిందీ ఆడియన్స్ కి తను పరిచయమే కాబట్టి తెలుగు పాన్ ఇండియా సినిమాలు ఆఫర్ వస్తే చేయాలని ఆసక్తిగా ఉంది పూజా హెగ్దే. మరి ఆ ఛాన్స్ ఎవరిస్తారన్నది చూడాలి. పూజా హెగ్దే హిందీలో ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆమెకు అక్కడ సరైన లక్ కలిసి రావట్లేదు. అందుకే అమ్మడు సౌత్ సినిమాల మీదే తన ఫోకస్ పెడుతుంది. తెలుగులో ఒక్క స్టార్ మూవీ ఛాన్స్ వస్తే మళ్లీ తిరిగి కెరీర్ లో పట్టు సాధించాలని చూస్తుంది అమ్మడు.

# దీన్ని మించిన హారర్ మూవీ ఉంటుందా..! సీన్ సీన్‌కు తడిసిపోవడం ఖాయం..!!



చాలా మంది సినీ లవర్స్ హారర్ సినిమాలు చూడటానికి ఎంతో ఇంట్రెస్ట్ చూపిస్తూ ఉంటారు. ఎంత భయంగా అనిపించినా కూడా కళ్లు మూసుకుంటూనే చూసేవారు చాలా మంది ఉంటారు. కానీ ఒంటరిగా చూడాలంటే మాత్రం భయమే. ఓటీటీల్లోనూ హారర్ సినిమాలకు సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంటుంది. కేవలం తెలుగులో సినిమాలు మాత్రమే కాదు ఇతరభాషల హారర్ సినిమాలు చూడటానికి కూడా ప్రేక్షకులకు ఆసక్తి చూపిస్తున్నారు. హారర్‌తో పాటు సినిమాలో కావలసినన్ని ట్విస్టులు ఉంటే.. ఆ వచ్చే కిక్కే వేరప్పా. అవునండీ.! ఇలాంటి హారర్ థ్రిల్లర్‌లకు ఫ్యాన్ బేస్ ఎక్కువే ఉంటుంది. హారర్ మూవీ లవర్స్ అయితే.. ప్రతీ సినిమాలోనూ కూసింత కొత్తదనాన్ని తప్పనిసరిగా కోరుకుంటారు. ఇక అలా వారి ఎక్స్‌పెక్టేషన్లకు రీచ్ అయిందంటే.. అది బెస్ట్ హారర్ ఫ్లిక్ అయినట్టే. మరి ఇప్పుడు మనం చెప్పుకోబోయేది కూడా ఆ టైప్ జోనర్‌కు చెందిన మూవీనే. మరి ఈ సినిమా టైటిల్ ఏంటి.? ఏ ఓటీటీలో చూడొచ్చునంటే.? ఈ సినిమా చూడాలంటే దైర్యం ఉండాల్సిందే.. బెస్ట్ హారర్ సినిమాల్లో టాప్ ప్లేస్ లో ఉండే సినిమా ఇది. ఇంతకూ ఈ సినిమా ఏంటంటే.. ఈ సినిమా నిజ జీవితంలో జరిగిన అన్నెలీసె మిచెల్ అనే జర్మన్ అమ్మాయి కేసు ఆధారంగా తెరకెక్కించారు. ఇక ఈ సినిమా కథ విషయానికొస్తే.. ఎమిలీ రోజ్ (జెన్నిఫర్ కార్పెంటర్) అనే 19 ఏళ్ల కాలేజీ అమ్మాయి ఒక రాత్రి తన హాస్టల్ గదిలో అసాధారణ ప్రవర్తన చూపిస్తుంది. దెయ్యాలు కనిపిస్తున్నాయని, వింత స్వరాలు వింటున్నానని అరుస్తుంది. డాక్టర్లు మొదట దీన్ని ఎపిలెప్సీ, తర్వాత సైకోసిస్ అని డయాగ్నోస్ చేస్తారు. ఈ ప్రక్రియలో ఎమిలీ ఏమీ తినకపోవడం, నీళ్లు తాగకపోవడంతో చాలా బక్కచిక్కిపోతుంది చివరికి మరణిస్తుంది. ఆతర్వాత ఏం జరిగింది అనేది కథ. ఈ సినిమా చాలా భయంకరంగా ఉంటుంది. ఈ సినిమా చూడాలంటే నిజంగా దైర్యం ఉండాలి. ఈ సినిమా పేరు ది ఎక్సార్సిజం ఆఫ్ ఎమిలీ రోజ్. ఈ సినిమా 2005లో విడుదలైంది. ప్రస్తుతం ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్ ఫ్లిక్స్ లో ఈ సినిమా అందుబాటులో ఉంది. ఈ సినిమా ఒంటరిగా చూడకపోవడమే బెటర్.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com